కందుకూరి రుద్రకవి

ఘనాఘనాష్టకం

ఆనంద మోహన కావ్యమాల





394.8271
R

Blank Page

కందుకూరి రుద్రకవి
జనార్దనాష్టకం

Blank Page

కందుకూరి రుద్రకవి

జనార్దనాష్టకం

పీఠిక : ఆరుద్ర

వర్ణచిత్రాలు : బాపు

ప్రచురణ : వి. ఎ. కె. రంగారావు

ఛాయాచిత్రాలు: షోలాకుమార్ రాజ్‌మహల్

ఆనందమోహన కావ్యమాల

Blank Page

కృతజ్ఞతా కారం

సత్ప్రయత్నం చేయటానికి మేధావులే అవసరంలేదు; భక్తిశ్రద్ధలు చాలు అని నాకు తెలియజెప్పి ఈ పుస్తకప్రచురణకు ప్రోత్సహించినది: శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారు. ఆనందమోహన కావ్యమాల అని నామకరణంచేసినదీ వారే. సాహితీవనం నా బోంట్లకు దుర్గమం అని నిశ్చయించుకొన్న నాకు దానిని సుగమం చేసికొనే మార్గం చూపించి; విజ్ఞాన సముపార్జనే విద్య, వినయసంకలితమైనదే. విద్య అని మాటలతోనూ వారి దివ్య జీవితం తోనూ బోధపరచినదీ వారే.

వారి ఋణం యే విధంగా తీర్చుకొనగలను; ఎన్ని జన్మలకైనా వారికి ఋణపడి వుండటమే నా భాగ్య విశేషం.

విపులమైన పీఠిక వ్రాసిన శ్రీ ఆరుద్రగారికి కృతజ్ఞతలను తెల్పనవసరంలేదు. గురువుగారి గురుతరజ్ఞానసంపదను కొంతయినా అర్థంచేసికొన్నవారూ, యీ కార్యం వారి కోసం చేసినవారూ కాబట్టి.

పద్యభావానికి వర్ణరూపం కల్పించిన శ్రీ బాపుగారికీ కృతజ్ఞతలు చెప్పబోను. చెప్పరాని వవి.

శ్రీ రామకృష్ణశాస్త్రిగారి ఆదేశానుసారం యిటువంటి శృంగార రచనలను కొన్నిటి నైనా అందంగా వెలికి తేగలిగితే అదే నేను చూపంగల కృతజ్ఞత.

వే. ఆ. కృ. రంగారావు

మొదటి ముద్రణ
శ్రీకృష్ణ జయంతి, కీలక

హక్కులు
ఆనందమోహన కావ్యమాల

ప్రచురణ
ఊహా ఎంటర్ ప్రైజెస్
1, ప్రైక్రాఫ్ట్స్ గార్డెన్స్
మద్రాసు-6

వెల
పన్నెండు రూపాయలు

ముద్రాశాల
క్రాంతి ప్రెస్
12, ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్
మద్రాసు-1

I

కందుకూరి రుద్రకవి
జనార్దనాష్టకం

Blank Page

III

కందుకూరి రుద్రకవి

జనార్దనాష్టకం

పీఠిక : ఆరుద్ర

వర్ణచిత్రాలు : బాపు

ప్రచురణ : వి. ఎ. కె. రంగారావు

ఛాయాచిత్రాలు: షోలాకుమార్ రాజ్‌మహల్

Blank Page

ప్రాకారం

సత్ప్రయత్నం చేయటానికి మేధావులే అవసరంలేదు: భక్తిశ్రద్ధలు చాలు అని నాకు తెలియజెప్పి ఈ పుస్తకప్రచురణకు ప్రోత్సహించినది: శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారు. ఆనందమోహన కావ్యమాల అని నామకరణంచేసినదీ వారే. సాహితీవనం నా బోంట్లకు దుర్గమం అని నిశ్చయించుకొన్న నాకు దానిని సుగమం చేసికొనే మార్గం చూపించి: విజ్ఞాన సముపార్జనే విద్య. వినయసంకలితమైనదే. విద్య అని మాటలతోనూ వారి దివ్య జీవితం తోనూ బోధపరచినదీ వారే.

వారి ఋణం యే విధంగా తీర్చుకొనగలను! ఎన్ని జన్మలకైనా వారికి ఋణపడి వుండటమే నా భాగ్య విశేషం.

విపులమైన పీఠిక వ్రాసిన శ్రీ ఆరుద్రగారికి కృతజ్ఞతలను తెల్పనవసరంలేదు. గురువుగారి గురుతరజ్ఞానసంపదను కొంతయినా అర్థంచేసికొన్నవారూ, యీ కార్యం వారి కోసం చేసినవారూ కాబట్టి.

పద్యభావానికి వర్ణరూపం కల్పించిన శ్రీ బాపుగారికీ కృతజ్ఞతలు చెప్పబోను. చెప్పరాని వవి.

శ్రీ రామకృష్ణశాస్త్రిగారి ఆదేశానుసారం యిటువంటి శృంగార రచనలను కొన్నిటి నైనా అందంగా వెలికి తేగలిగితే అదే నేను చూపంగల కృతజ్ఞత.

వే. ఆ. కృ. రంగారావు

మొదటి ముద్రణ
శ్రీకృష్ణ జయంతి, కీలక

హక్కులు
ఆనందమోహన కావ్యమాల

ప్రచురణ
ఊహా ఎంటర్ ప్రైజెస్
1, ప్రైక్రాఫ్ట్స్ గార్డెన్స్
మద్రాసు-6

వెల
పన్నెండు రూపాయలు

ముద్రాశాల
క్రాంతి ప్రెస్
12, ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్
మద్రాసు-1

విషయసూచిక

నాలుగు ముక్కలు	1
కందుకూరు	2
రుద్రకవి	8
జనార్దనుడు	14
అష్టకం	21
జనార్దనాష్టకం, వర్ణచిత్రాలు	29
అనుబంధాలు	43
రాఘవాష్టకం	45
కడపాధి నాయకాష్టకం	47
నవనీత చోరాష్టకం	49
భ్రమరాంబికాష్టకం	51
ఒంటిమిట్ట రఘునాయకాష్టకం	53
కిలుపల్లు కోనేటి రాయాష్టకం	55
వేంకటేశ్వరాష్టకం	56
మాధవాష్టకం	58
సవరణలు : వివరణలు	60

Blank Page

నాలుగు ముక్కలు

ఇది కందుకూరు రుద్రకవి వ్రాసిన జనార్దనాష్టకానికి పీఠిక. వాస్తవానికి ఇది మా గురువుగారు మల్లాది రామకృష్ణశాస్త్రిగారు వ్రాయవలసినది. ఆయన కీర్తిశేషులయ్యారు. వారు వేనోళ్ళ భాషించగల శేషులు, రసికత తెలిసిన పండితులు. కందుకూరు జనార్దనాష్టకాన్ని సచిత్రంగా ప్రకటించమని మిత్రులు శ్రీ వెంకట ఆనంద కృష్ణ రంగారావుగారికి గురువుగారు సలహా ఇచ్చారు. రంగారావుగారు ఆ అభిలాషను ఆదేశంగా స్వీకరించారు. మిత్రులు బాపుగారిచేత చిత్రాలు వేయించారు, ప్రచురణకు సర్వ సన్నాహాలు పూర్తిచేసేసరికి గురువుగారు మరణించారు. పీఠిక వ్రాసే బాధ్యతను రంగారావుగారు నా మీద పెట్టారు.

రామకృష్ణశాస్త్రిగారు ఈ పీఠిక వ్రాసి ఉంటే ఎన్నో సంగతులు చెప్పి ఉండేవారు; ఎన్నో అపూర్వ విషయాలను తెలిపేవారు. లేక ముక్తసరిగా మూడు మాటలు వ్రాసి రుద్రకవి అష్టకాన్ని చదువుకొని సంతోషించమనేవారు. కత్తిలాటి వారి ప్రతిభ అన్ని వైపులా పదునుగానే ఉంటుంది గాని దానిని వారు ఒకప్పుడు ఒరలోంచి తియ్యనే తియ్యరు. నారాయణామాత్యుని హంస వింశతికీ, ముద్దు పళని వ్రాసిన రాధికా సాంత్వనానికీ వారు వ్రాసిన పీఠికలు వారి సర్వతోముఖ వైదుష్యానికి నిదర్శనాలు. వాటంత విపులంగా ఈ పీఠిక ఆయన వ్రాసి ఉంటే ఆనందించేవాళ్లం.

అలా జరగలేదు. నా మిడిమిడిజ్ఞానంతో ఇది వ్రాస్తున్నాను. కందుకూరు రుద్రకవి వ్రాసిన జనార్దనాష్టకం గురించి వ్రాయాలి కనుక కందుకూరు చరిత్ర, రుద్రకవి జీవితం, జనార్దనుని వైనం, అష్టకాల పరిణామం, కూలంకషంగా పరిశోధించి వివరాలతో ఈ పీఠిక వ్రాయాలని సంకల్పం. అయితే అభిలాష ఎంత బలంగా ఉన్నా వ్యవధి తక్కువ, వ్యాపకాలు ఎక్కువ. అందుచేత ఏవో నాకు తెలిసిన నాలుగు ముక్కలు వ్రాస్తాను.

1

కందుకూరు

కందుకూరు నెల్లూరు జిల్లాలో ఉంది. కందుకూరు తాలూకాకు ఈ గ్రామం ముఖ్యపట్నం. క్రీ.శ. 848 నుండి కందుకూరు అనే పేరు చరిత్రలో కనబడుతుంది. అత్యంత ప్రాచీనకాలంలో ఈ ప్రాంతాలను పల్లవులు పాలించేవారు. వారి తరువాత తూర్పు చాళుక్యుల ఏలుబడిలోనికి ఈ సీమ వచ్చింది. నాటినుంచీ కందుకూరి చరిత్రను కొంత స్పష్టంగా చెప్పుకొనవచ్చును. వాస్తవానికి శాసన ప్రమాణాలతో చరిత్ర వ్రాసుకోగలిగిన కొద్దిపాటి నగరాలలో మరీ ప్రాచీనమైనది కందుకూరే. మన తెలుగుదేశంలో లభించిన మొట్టమొదటి పద్యమయ శాసనంలో కందుకూరు ప్రస్తీ, ప్రశస్తీ ఉన్నాయి.

క్రీ.శ. 848 లో బెజవాడ రాజధానిగా గుణగ విజయాదిత్యుడు వేంగీదేశాన్ని పాలించాడు. అతడు పట్టంకట్టుకొన్న మొదటి సంవత్సరమే దక్షిణాదిని బోయగొట్టాలలో తిరుగుబాటు జరిగింది. దానిని అణచడానికి గుణగ విజయాదిత్యుడు సామంత సైన్యాలతో పండరంగుడనే విశ్వాసపాత్రునికి సైన్యాధిపత్యం ఇచ్చి పంపించాడు. బోయగొట్టాలను సాధించి కట్టెపుదుర్గాన్ని బయలుచేసి పండరంగడు అద్భుతమైన విజయాలను చేకొన్నాడు. ఆ సీమపై ఆధిపత్యాన్ని గుణగ విజయాదిత్యుడు తన 'పక్షపాతి'యైన పండరంగనికే ఇచ్చాడు. ఎక్కడ స్థానిక రాజధానిని నిర్మించాలా అని యోచిస్తున్న పండరంగడు కందుకూరును చూశాడు. దానిని మెచ్చుకొని ఆ గ్రామాన్ని బెజవాడంత ప్రసిద్ధమైన దానిని చేశాడు. ఈ విషయాలను ఈ క్రింది తరువోజ చెప్తుంది.1

పట్టంబు గట్టిన - ప్రథమంబు నేండు
ఖలగర్వ మొప్పగ - బై లేచి సేన
పట్టంబు గట్టించి - ప్రభు పండరంగు
బంచిన సామంత - పదువతో బోయ
కొట్టముల్ పండ్రెండు - గొని వేంగినాటి
కొఱల్చియ ద్రిభువనాం - కుశ బాణ నిల్పి
కట్టెపు దుర్గంబు కడు బయల్సేసి
కందుకూ ర్బెజవాడ గావించె మెచ్చి.

---

1. నెల్లూరు శాసనాలు : బట్టర్వర్తు వేణుగోపాలసెట్టి సంకలనం. సంపుటి 2. పుట 96; మల్లంపల్లివారి అనంతర వ్యాఖ్యానం : భారతి మార్చి 1928.

అప్పటికి ఎన్ని శతాబ్దాల నుంచీ ఉంటున్నదోగాని క్రీ. శ. 848 దగ్గర్నుంచీ కందుకూరు స్థానిక రాజధాని అని చెప్పవచ్చు. పండరంగడు దీనిని బెజవాడగా, అంటే ముఖ్యనగరంగా, మార్చాక ఈ దుర్గం దేశ చరిత్రలో సుస్థిరమైంది. తూర్పు చాళుక్యుల తరువాత ఈ ప్రాంతాలు తెలుగు చోళుల పాలనలలో ఉండేది. కాకతీయులకు వీళ్ళు అణకువగా ఉండేవారు. క్రీ. శ. 1322 లో ప్రతాపరుద్రదేవ మహారాజులవారి రాజ్యకాలంలో 'కామయ బొప్పనింగారు' అనే ప్రముఖుడు కందుకూరు ఏలుతూ ఉండేవాడు. ఆయన ఈ ఊళ్ళో ఉన్న కలికేశ్వరస్వామి వారికి దానం చేశాడు. [1]

దశావతారాలలో ఇతర అవతారమూర్తులకు దేవాలయాలు దేశమంతటా కనబడతాయిగాని కలికేశ్వరుడికి ఒక్క- కందుకూరు సీమలోనే గుళ్ళు ఉన్నాయి. ప్రతాపరుద్రుని కాలంనుంచి కృష్ణదేవరాయల వారి కాలం దాకా ఈ ఆలయం కందుకూరులో అతి వైభవంగా ఉండేది. ఈ దేవరకు కామయ బొప్పనింగారి నుంచి, రాయసం కొండమరుసయ్య దాకా ఎందరో కార్యకర్తలు చేసిన దానశాసనాలు ఈనాడు కందుకూరులోని మసీదు గోడలలో, ప్లీర్లబావి మెట్లలో కనబడతాయి. కందుకూరి సీమ మహమ్మదీయుల చేతికి చిక్కినప్పుడు వాళ్లు కలికేశ్వరాలయాన్ని పడగొట్టి ఉంటారు.

కందుకూరులోని కలికేశ్వరాలయపు నామరూపాలు నశించినా ఈ గ్రామానికి దగ్గర్లోనే చుండిలో మాత్రం ఒక కలికేశ్వరాలయం నామం నశించి పాత రూపంతో అలాగే ఉంది. రెగళిగె నిమ్మనాథుని కాలంలో అంటే క్రీ. శ. 1709 లో చుండిలో కలికేశ్వరాలయం ఉండేదని చెప్పవచ్చు.[2] అతడు గురునంబి చరిత్ర అనే యక్షగానాన్ని వ్రాసి కల్కి దేవరను పేర్కొన్నాడు. గ్రంథాదిని ఆ దేవుణ్ణి ఇలా ప్రార్థించాడు.

ధవళగిరి సన్నివాసుని
ధవళోరగ భూషితాంగు ధవళాంశుధరున్
ధవళభసిత త్రిపుండ్రుని
ధవళాంగునిఁ జుండి కల్కి దైవము గొల్తున్.

[D. 1870

సుమారు 250 సంవత్సరాలకు పూర్వం చుండిలో కల్కిదైవం ఉండేవాడని ఈ పద్యంవల్ల తెలుస్తుంది. నేడు ఆ గ్రామంలో ఉన్న శివాలయమే పూర్వం కలికేశ్వరాలయంగా ఉండేదనీ నేటి పేరు తప్పనీ పరిశోధకులు భావిస్తున్నారు.[3] కల్కిదైవం శైవమూర్తే అని ఇందువల్ల అనుకోవాలి. వాస్తవానికి వైఖానస ఆగమాల

---

1. నెల్లూరు శాసనాల సంపుటి: కందుకూరు 40.
2. నిమ్మనాథుని కాలనిర్ణయం డాక్టరు. యస్వీ జోగారావుగారు తమ యక్షగాన వాఙ్మయ చరిత్రలో చేశారు. ద్వితీయ భాగం పుట. 37.
3. విక్రమ సింహపురి మండల సరస్వంలో శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి 'శిల్ప శోభలు' వ్యాసం-తృతీయఖండం. పుట 22.

ప్రకారం కల్కి విగ్రహం వైష్ణవమూర్తి. ఇది గుర్రం ముఖం, మానవ శరీరంగల రూపం. నాలుగు చేతులలోనూ శంఖ, చక్ర, ఖడ్గ, ఖేటకాలు ఉండాలి. చుండి ఆలయంలోని విగ్రహం ఎలాగ ఉందో నాకు తెలియదు. నేను చూడడానికి వెళ్ళినప్పుడు ఆలయం తలుపులు తాళం వేసున్నాయి. (వారాని కోసారే ఒక పావుగంటసేపు పూజా పురస్కారాలు జరిపించడానికి ఎక్కడనుంచో అర్చకుడు వచ్చి తలుపులు తీస్తాడట!)

చుండిలోనూ, కందుకూరులోనూ కలికేశ్వరాలయాలు ఉండేవని నికరంగా చెప్పుకో వచ్చును. కందుకూరులో ఈ దేవర పేరిటి ఆలయమే అత్యంత ప్రాచీనం, ప్రతాపరుద్రుని కాలంలో ప్రసిద్ధమైనదంటే అంతకు పూర్వమే దాని ప్రతిష్ఠ జరిగి ఉండాలి.

కాకతీయుల పాలన అంతరించాక కందుకూరి సీమలో రెడ్డిరాజుల ప్రాభవం పెరిగింది. అద్దంకి రాజధానిగా ప్రోలయ వేమారెడ్డి క్రీ. శ. 1325 నుండి 1353 దాకా పాలించాడు. ఈయన శ్రీ శైలానికి మెట్లు కట్టించాడు. ఎర్రాప్రెగడగారిని ఆదరించి వారిచేత కావ్యాలు చెప్పించాడు. ఈయన అన్నగారి మునిమనుమడు రాచ వేమారెడ్డి క్రీ. శ. 1430 దాకా రాజ్యం చేశాడు. అతడు క్రీ. శ. 1398 లోనే ఒక సూర్యగ్రహణం నాడు కందుకూరులోని జనార్దనస్వామి వారికి ఒక పెద్ద తటాకాన్ని దానం చేశాడు.[1] ఈ దానశాసనం కందుకూరు కోటలోని మసీదు దక్షిణ స్తంభంపైన ఉంది. కందుకూరు జనార్దనదేవర గురించి తెలియవచ్చే శాసనాలలో ఇది ప్రాచీనం. క్రీ. శ. 1322 నుంచీ కలికేశ్వరాలయం, క్రీ. శ. 1398 నుంచీ జనార్దనాలయం కందుకూరులో ఉండేవని మాత్రం ఈ శాసనాల వల్ల చెప్పవచ్చు.

కందుకూరులోని జనార్దనాలయం ఎవరు నిర్మించారో తెలియదుగాని నిర్మాత విగ్రహం ఒకటి శిథిలమై ఆలయ ప్రాంగణంలో కనబడుతుంది. నాగ విగ్రహాలున్న చెట్టు చప్టామీద తల విరిగిన విగ్రహం ఈ ఆలయం కట్టించిన ఎవరో రెడ్డిరాజుదై ఉంటుంది. గుడి ప్రతిష్ఠించిన వారి విగ్రహం ఆలయంలో ఉండడం సహజమే.[2] చుండిలో జనార్దనాలయాన్ని క్రీ. శ. 1408 లో మల్లారెడ్డి నిర్మించాడు.[3] అతడూ అతని భార్యా ఉన్న శిల్పం చుండి ఆలయ ప్రాంగణంలో ఉంది. క్రీ. శ. 1398 లోనే రాచవేముని దానశాసనం ఉంది కనుక అంతకు పూర్వమే కందుకూరు జనార్దనదేవర ప్రతిష్ఠ జరిగి ఉంటుంది. ఈ ఆలయాన్ని రాచవేముడే కట్టించాడేమో.

కందుకూరులోనూ చుండిలోనూ కలికేశ్వరాలయంలోబాటు జనార్దనాలయం ఉండడం గమనించ దగ్గ విశేషం. ఈ ఇద్దరు దేవుళ్ళకూ సంబంధం ఉంది. బ్రహ్మాండ పురాణం ప్రకారం జనార్దనుడే కల్కి రూపంలో యవనులనూ హూణులను సంహరించాడు.[4] ఈ పురాణ వచనంవల్లనే ఈ సీమలో ఈ ఇద్దరి దేవర్లకు గుళ్ళు వెలిశాయి అనుకోవచ్చు.

---

1. నెల్లూరు శాసన సంపుటి. కందుకూరు 35.
2. ఈ విగ్రహాన్ని నా దృష్టికి తెచ్చినది నాతోపాటు కందుకూరు చూడడానికి వచ్చిన పరిశోధక మిత్రులు శ్రీ నేలనూతుల శ్రీకృష్ణమూర్తిగారు.
3. నెల్లూరి శాసన సంపుటి కందుకూరు 21.
4. బ్రహ్మాండ II 39-49.

కందుకూరులోని జనార్దనాలయం ఎవరు కట్టించినా ఆదినుండీ ఇక్కడ అంగ రంగ వైభోగాలు ఉండేవి. రెడ్డిరాజుల తరువాత ఈ సీమ కొన్నాళ్ళు గజపతుల పాలనలో ఉన్నా ఉత్తరోత్తరా విజయనగర సామ్రాజ్యంలో కలిసింది. ఉదయగిరి మొదలిదుర్గంగా ఈ సీమను కృష్ణదేవరాయల కార్యకర్త పరిపాలించేవాడు. ఆ కాలంలోనే ఈ క్రింది చాటువు పుట్టింది.

ఉదయగిరి రాజ్యలక్ష్మికి
సదనము నెల్లూరు, యట్టి సాధ్వీమణికిన్
వదనంబు కందుకూరగు
పదయుగళం బాతుకూరు బట్టేపాడున్.

ఉదయగిరి రాజ్యలక్ష్మికి వదనమైన కందుకూరు ఆ నాడు కలకలలాడుతూ ఉండేది. ఆ వైభవాన్ని ఈ క్రింది పద్యం చాటుతుంది.1

బంధుర విప్రవర్ర గృహభాసుర గోపుర సౌధ వీధికా
బంధు తటాక కూప పరిపక్వ ఫలాన్విత వృక్ష వాటికా
గంధ మదభ్రమ ద్భ్రమర గాన విహారికి కందుకూరికిన్
సింధు పరీత భూములను జెప్పగ నొప్పగు సామ్యమబ్బునే.

దీని సామ్యం మరొకటి లేదనే మహోన్నత వైభవం నిజంగా విజయనగర సామ్రాజ్య కాలంలో కందుకూరు అనుభవించింది. కృష్ణదేవరాయల వారి కార్యకర్తగా రాయసం కొండ మరుసయ్య ఈ ప్రాంతాలలో ఉండి ప్రజానురంజకంగా పాలించాడు. తటాకాలు తవ్వించాడు. దేవాలయాలకు దానాలు చేశాడు. కందుకూరు జనార్దనస్వామికి ఆయన ఇచ్చిన దానాన్ని ఈ క్రింది శాసనం తెలియచేస్తుంది.

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౪౨ అగునేంటి
విక్రమ సంవత్సర వైశాఖ శు ౧౫ గు శ్రీమన్ మహామండలేశ్వర రాజాధిరాజ రాజ
పరమేశ్వర మూరురాయరగండ యష్టదిగ్రాయమనోభయంకర బాసతప్పువరరాయగండ
పూర్వ దక్షిణ పశ్చిమ సముద్రాధీశ్వర కర్ణాటక రాజ్యలక్ష్మీ మనోహర
విజయనగర సింహాసనాధీశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ కృష్ణదేవరాయ
మహారాయల రాజ్యభారధురంధరులున్ను భారద్వాజగోత్రోద్భవులున్ను
అశ్వలాయన సూత్రపవిత్రులున్ను అయిన రాయసం కొండమరుసయ్యవారు
రాయసింహాసనానకు మొదలిదుర్గమైన ఉదయగిరి దుర్గాధిపతిత్వము సేస్తున్ను
శ్రీశైలానకు ఆగ్నేయ దిగ్భాగమైన స్కాందస్థానమందున్ను అగస్త్య మహాముని కి
ప్రత్యక్షమైన జనార్దనదేవునికి 'శ్రీమత్సకల లోకేశ. శంఖ చక్ర గదాధర

---

1. ఈ పద్యాన్ని కందుకూరి రుద్రకవే చెప్పాడు. చాటుపద్య మణిమంజరి II పుట 112

కందుకూరి పురానైక జనార్దన నమోస్తుతే' ఆది సత్య నయభక్తులను సాష్టాంగ దండప్రణామంబు సేసి సమర్పించిన గ్రామానకు ధర్మ శిలాశాసనము ఉదయగిరి రాజ్యానకు జెల్లి కందుకూరి శీమలోన పాలేటి ధరిని రావి అని గ్రామమూ సర్వమాన్యముగాను నేంటి సోమగ్రహణ పుణ్యకాలమందు....

[నెల్లూరి శాసనాల సంపుటి. కందుకూరు 30.

ఇలాగ సర్వమాన్యాలుగా ఎన్నో గ్రామాలు జనార్దనదేవునికి ఉన్నాయి. ఆ రోజుల్లో ఆలయ ప్రతిష్ఠ జరిగితే 'దేవరమహోత్సవాలకు పరివారము చేతను బంటుబడి దుగాండ్లున్ను ధారవోయించి తమ నగరను మాసపక్ష మహోత్సవాలకు వడ్లున్ను భోగజీతాలున్ను' ఏర్పాట్లు చేసేవారు.1

ఆ రోజుల్లో దేవాలయాలే కళాక్షేత్రాలు. సంగీత సాహిత్యాలకూ నాట్యాలకూ గుళ్ళే పట్టుకొమ్మలు. కందుకూరులో పూర్వం కల్కి, జనార్దనులకే కాక కామేశ్వరుడికి కూడా ఆలయం ఉండేది. దీనికి కూడా మడిమాన్యాలు ఉండేవి. ఈ మూడు దేవాలయాలతోపాటు అంకమ్మ గుడి కూడా ఉంది. ఈమె గ్రామదేవత. ఈ ముఖ్య దైవాలే కాక చిల్లర దేవతలు కూడా లేకపోలేదు. ఊరి మధ్య ఇప్పుడు ఈత మొక్కలమ్మ గుడి ఉంది. ఈ దేవత కాళ్ళదగ్గర మూడు మానవ శిరస్సులు ఉన్నాయి. ఈ శిరస్సులు ఇంద్రసేన, భద్రసేన రుద్రసేనులవి. ఈ దేవత కామాక్షీదేవి. క్రీ. శ. 1353 లోనే ఇటువంటి విగ్రహం ఒకటి అలంపూరులో ఉంది. ఈ దేవత గురించీ ఈ శిరస్సుల సంగతీ ధర్మపాల విజయం అనే కాంస్యకార వీరచరిత్రలో ఉంది.2 బహుశా ఈత మొక్కలమ్మ విగ్రహం కందుకూరులో 14 వ శతాబ్దినుంచీ ఉండి ఉండవచ్చు.

రాయసం కొండమరుసయ్య తరువాత కందుకూరి సీమపై అధికారు లెవరో నికరంగా చెప్పలేం. ఆరవీటి రాజులు రాయసింహాసనం ఎక్కాక కందుకూరి ప్రాంతాలు బహుశా దామెర్లవారి అధీనంలోనికి వచ్చి ఉండవచ్చు. క్రీ. శ. 1614 నుండి 1619 దాకా పాలించిన రెండవ శ్రీరంగదేవరాయల వారి కాలంలో దక్షిణ రాజ్యాలను జయించాలని గోల్కొండ సైన్యాలు వచ్చి కందుకూరి బయళ్ళలో దిగాయి. అప్పుడు దామెర్ల పెదవెంకటప్పనాయనిం వారు శ్రీరంగరాయల వారితో కలిసి కందుకూరి బారుమీదికి పోయి లడాయిచేసి రాయల వారికి జయప్రదం చేసి ఇచ్చారు. ఈ సహాయానికి సంతోషించే రాయల వారు దామెర్ల వారికి కాళహస్తి, వందవాసి, చెంజి వగైరా రాజ్యాలు ఇప్పించారు. వెంకటప్పనాయని వారి విజయాలను కీర్తించే చాటువులు చాలా ఉన్నాయి. 'గోలకొండ వజీరుగొట్టి దుముదారుగా గందుకూరి బయళ్ళ గదిసినపుడు' 'తనకు గాయంబు దాకిన దలక కపుడు నెంచి గోలించి తురకల త్రుంచి' న దామెర్ల వారి కీర్తిని ప్రశంసించే ఒక చాటువులోని ఎత్తు గీతి ఇలా ఉంది:

---

1. నెల్లూరు శాసన సంపుటి. కందుకూరు 18
2. ఈ గాథ గురించి శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారు వివరించారు. కలగూర గంప: విచిత్రపు వీరశిల - భారతి ఆగస్టు 1961.

కందుకూరందు వైభవ క్రమము లెల్ల
నెంచి వినుతించ నా బ్రహ్మకేని దరమె
యమిత గుణహార! కృష్ణమాంబా కుమార!
వెలయు దామెర చెన్న భూ వెంక టేంద్ర!

[చాటుపద్య మణిమంజరి II పుట 331]

కందుకూరి యుద్ధంలో జయంపొందాక రాయలవారు ఈ సీమను కూడా దామెర్ల వారికి ఇచ్చారేమో పరిశోధించాలి. ఏమైనా విజయనగర సామ్రాజ్యం చితికిపోయాక కందుకూరు సీమ గోలకొండ హస్తగతమైంది. క్రీ. శ. 1640 నుంచి ఉదయగిరి కందుకూరు-సీమలలో మహమ్మదీయ పాలకుల శాసనాలు కనబడతాయి. కొన్ని దేవాలయాలను పడగొట్టి మసీదులు కట్టారు. ఇవాళ కందుకూరులో అయిదు పాత మసీదు లున్నాయి. కోట దర్వాజా గోడలన్నీ దేవాలయ శిధిలాలతో కట్టినవే- చాలా శిల్పాలను లోపలవైపు పెట్టి కట్టారు. ఒకటో రెండో లోకుల కంట పడతాయి.

క్రీ. శ. 1650 లో అబ్దుల్లా కుతుబ్‌షా హయాంలో కందుకూరులో గోల్కొండ ఫవుజుదారు ఉండేవాడు. అంకోజీ పంతులు అనే ఆయన హవల్దారుగా ఉండేవాడు. మొత్తంమీద తూర్పు చాళుక్యుల కాలంనుంచి గోల్కొండ నవాబుల కాలందాకా కందుకూరులో రాజప్రతినిధులు ఉండేవారు. ఆ వివరాలు చూడండి:

రాజవంశం: రాజు	ప్రతినిధి	కాలం
తూర్పు చాళుక్యులు: గుణగ విజయాదిత్యుడు	దండరంగడు	క్రీ. శ. 848
కాకతీయులు: ప్రతాపరుద్రుడు	కామయ బొప్పనింగారు	,, 1322
రెడ్డిరాజులు:	— —	
రాచవేమా రెడ్డి		,, 1398
మల్లా రెడ్డి	— —	
తుళువ రాయలవంశం: కృష్ణదేవరాయలు	రాయసం కొండ మరుసయ్య	,, 1520
ఆరవీటిరాజులు: శ్రీరంగరాయలు	దామెర్ల వెంకటపతి	,, 1614
గోల్కొండ నవాబులు: అబ్దుల్లా కుతుబ్‌షా	అంకోజీపంతులు	,, 1650

కందుకూరును పాలించిన వాళ్ళ పేర్లు ఇలా వాళ్ళ కాలాలతోపాటు తెలుస్తున్నా ఈ ఊళ్ళో ఉన్న విద్వాంసుల పేర్లు రాయల యుగంనుంచి మాత్రమే దొరుకుతున్నాయి. కృష్ణరాయల వారి కాలంనుంచి గోల్కొండ నవాబుల కాలందాకా కందుకూరులో రుద్రకవి అనే ప్రతిభావంతులు నలుగు రైదుగురు ఉండేవారు.

2

రుద్రకవిः

కృష్ణదేవరాయల వారి కాలంలో ఉండే రుద్రకవి ప్రథముడు. అతడు అష్ట దిగ్గజాలలో ఒకడు. పన్నెండేళ్లపాటు రాయలవారి సభాభవనం భువన విజయంలో ఈశాన్య సింహాసనంపై మొదటి రుద్రకవి అధిష్ఠించాడని ప్రతీతి. మత్సరగ్రస్థులైన పండితులు ఆదిలో ఇతనికి సభా ప్రవేశం కలిగించలేదట. ఈ కవి ప్రతిభను రాచమంగలి కొండోజీ ఎలాగో రాయల వారిని చెవిని వేశాడు. ఆశ్రయం దొరికింది. మొదటి రుద్రకవి ఏ గ్రంథాలు వ్రాశాడో తెలియదు. చాటు పద్యాలు చెప్పడంలో, సమస్యలు పూరించడంలో తిట్టు కవిత్వం చెప్పడంలో తొలి రుద్రకవి ఆరితేరిన వాడని భావించవచ్చు: అయితే కృష్ణదేవరాయల వారి ఆస్థానంలో ఉండే రుద్రకవే 'సరసజన మనోరంజనం' అనే ప్రబంధం వ్రాశాడని చెప్తూ అందులోంచి బ్రౌను దొరగారు రెండు పద్యాలను ఉదాహరించారట. వీటిని వీరేశలింగంగారు పేర్కొన్నారు.1 రెండూ చక్కని పద్యాలే. ఒకటి పుంభావరతిని వర్ణిస్తుంది.

కొప్పున జుట్టిన గొజ్జంగి విరిదండ
నటనతో వీపున నాట్యమాడ
బటువైన ముత్యాల పాపట విరజాజి
తీరుగా జెంపల దిమురుగట్ట
ధగధగద్ధగలచే దనరు కెంపునతాళి
సరులతో బెనగొని చొకళింప
గబ్బిగుబ్బలమీది కస్తూరి చెమటల
గరగి వాసనలచే గ్రమ్మగొనగ
వింత మాటల తేటల విభుని గూడి
కాంత రతికేళి మిక్కిలి గారవింప
దప్పితీఱంగ నధరామృతము లొసగి
చంద్ర బింబాస్య మగలాగు సలిపెనిపుడు.

[D. 1260 (?)

---

1. ఆంధ్రకవుల చరిత్రము-రెండవభాగం పుటలు 224, 225.

ఇంత నేర్పుగా మగలాగు సలిపిన మగువ ఒకప్పుడు ముద్దరాలే. ఆ విషయాన్ని సరసజన మనోరంజనంలోని కవే ఇలా వర్ణించాడు.

ఎన్నడు నేరిచెన్ బెళుకు లీ చెలి కన్నులు, కారుకమ్ము ల
న్నన్న కురుల్, పిఱుందు బటువై పటువై ఖరి గైకొనెంగదే,
మొన్న గదమ్మ పిన్న మొన మొల్కలు నే డివె ముద్దులాడి లే
జన్నులు గొప్పవై పయిటసందున దాగుడుమూత లాడెడున్.

ఈ పద్యంలో 'మొలక' అనే పదాన్ని 'మొల్క' అని కవి ప్రయోగించాడు. ఇది అపప్రయోగం అని కొందరు కవులు వినుకొండలో గుంటుపల్లి భాస్కరయ్యగారి కొలువులో ఆక్షేపించారు. అప్పుడు రుద్రకవి తనను తాను సమర్థించుకొన్నాడు. అప్పటికే ఒక పూర్వ కవి ఇలాంటి ప్రయోగం చేశాడు. చరికొండ నరసయ్య అనే ఆయన వెలగకు వెల్గ అని ప్రయోగించాడు. దానిని ప్రమాణంగా రుద్రకవి చూపించాడని ఈ క్రింది పద్యాన్ని అప్పకవి ఉదాహరించాడు.

వెలగకు వెల్గయంచు సవరిన్ జరికొండ నృసింహుడాడగా
మొలకకు మొల్కయంచు గవి ముఖ్యుడు రుద్రయ పల్క దోసమా?
బళిబళి! మంచి మాటయె ప్రబంధమునా జలరాశి యిందులో
పల నెరసుల్ గ్రహింతురె యపారములా మణులెల్ల నుండగన్.

[అప్పకవీయం 5-114.

మొలకకు మొల్క అని ప్రయోగించిన రుద్రకవిది గుంటుపల్లి భాస్కరుని కాలమని అప్పకవీయంవల్ల తెలుస్తోంది. ఈ భాస్కరుడు క్రీ.శ. 1620 ప్రాంతాలవాడు. ఇతని కాలంలోని రుద్రకవి అంతకు నూరేళ్ళకు ముందు క్రీ.శ. 1520 లో మహావైభవ స్థితిలోనున్న కృష్ణరాయలవారి ఆస్థానంలో ఉండడం పొసగదు కాబట్టి 'మొల్క రుద్రయ్య' మూడో రుద్రకవో నాలుగో రుద్రకవో కావచ్చును. అందుచేత సరసజన మనోరంజనం తొలి రుద్రకవి వ్రాసినది కాదని ధీమాగా అనుకోవచ్చును. ఇప్పటికి అతని గ్రంథ మేమీ బయటపడలేదని భావించవచ్చు.

ఇక రెండో రుద్రకవి గురించి: ఇతడు ఇబ్రహీం పాదుషావారి కాలంలో అంటే క్రీ.శ. 1550 నుండి 1580 లోపున ఉండేవాడు. ఈ రుద్రకవి తండ్రిపేరు పెదలింగన్న, తల్లి చెన్నమ్మ, సోమవార వ్రతము చేసేది. ఈ కవి చిన్నప్పట్నుంచీ కాళీభక్తుడు. కందుకూరులోని అంకమ్మ తల్లే ఆ కాళి అని భావించవచ్చు, తాను కాళీ వరప్రసాదలబ్ధ వర్ణ వర్ణనీయ కవిత్వ తత్త్వంలో ధారేయుణ్ణని రుద్రకవి చెప్పుకొన్నాడు. అమ్మవారి దయవల్ల కవిత్వం ప్రాప్తించినా రుద్రకవి తన తొలి రచన నిరంకుశోపాఖ్యానాన్ని కందుకూరులోని సోమేశ్వరస్వామికి అంకిత మిచ్చాడు. బాల్య చాపల్యము పెంపున ఈ కృతిని రచించానని

రుద్రకవి చెప్పుకొన్నా ఇది ప్రౌఢంగానే ఉంది. ఈ కాళీభక్తుడు శివునికి తన తొలి కృతిని అంకితమిచ్చినా అతనికి కందుకూరులోని జనార్దనస్వామి వారంటే కూడా చాలా భక్తి. నిరంకుశోపాఖ్యానంలో జనార్దనుణ్ణి ఇలా కృత్యాదిని కీర్తించాడు.

పక్కరా తేజిపై నెక్కి యభ్యాసి
చాణూరు ద్రుంచిన సత్యరాశి
సిరి మనోధనము ముచ్చిలిన కన్నపు దొంగ
గొల్ల చేడెలతోడు కోడెకాఁడు
భువనమంతయు గన్న పుత్రుగాంచిన తండ్రి
స్వర్ణాంబరము గట్టు వన్నెబెట్టు
పౌరస్త్యభోగిపై బవళించు సుఖవాహ
పరమపదం బేలు పాదుపాహి

మానవులకెల్ల నిజపద స్మరణమాత్ర
నైహికా ముష్మికము లిచ్చునట్టి దాత
కందపుర జనార్దనుడు భీకర విరోధి
మర్దనుఁడు భక్తలోకంబు మనుచుగాత.

[నిరంకుశ-1-2.

ఇలా జనార్దనుణ్ణి నుతించిన నిరంకుశోపాఖ్యానంలో రుద్రకవి ఆనాటి సానివాడను చాలా బాగా వర్ణించాడు. జనార్దనస్వామివారి ఆలయంలో చాలామంది భోగంపడుచులు ఉండేవారు కాబోలు. వసంతోత్సవాలలో వారు ప్రదర్శించడానికో లేక జనార్దనాలయ మండపంలో ఇతరులు ఆడడానికో రుద్రకవి సుగ్రీవ విజయం అనే యక్షగానాన్ని వ్రాశాడు. దానిని జనార్దనునికే అంకిత మిచ్చాడు. మన యక్షగాన వాఙ్మయంలో సంపూర్ణంగా లభించే కావ్యాలలో ఇదే ప్రముఖమైనది, రసవంతమైనది.

నిరంకుశోపాఖ్యానం రచించిన రుద్రకవే సుగ్రీవ విజయం రచించాడని చెప్పడానికి రెండింట్లో కవి తన తండ్రిపేరు పెదలింగన్న అని చెప్పుకొనడమే ప్రమాణం. ఈ రెండు కావ్యాలలో జనార్దనుణ్ణి నుతించిన రుద్రకవే జనార్దనాష్టకాన్ని వ్రాశాడనుకోడంలో తప్పులేదు. సుగ్రీవ విజయం చక్కని దేశిరచన. అష్టకం కూడా అటువంటి తీయని దేశిరచనే. ఈ రెండూ ఒకరే వ్రాసి ఉండడానికి ఆస్కారం ఉంది.

ఈ రెండవ రుద్రకవికే గోల్కొండను పాలించిన ఇబ్రహీం కుతుబ్‌షా చింతలపాళెం అనే గ్రామాన్ని ఇచ్చాడట. ఇది క్రీ.శ. 1555 లో జరిగిందని ప్రతీతి. అయితే పరిశోధకులు దానకాలాన్ని శంకిస్తున్నారు.1

---

1. అష్టదిగ్గజములు. అష్టదిగ్గజవర్ధంత్యుత్సవ సమితి ప్రచురణ-హైదరాబాదు-సేలటూరివారి వ్యాసం పుట 22.

ఈ రెండవ రుద్రకవికో లేక మూడవ రుద్రకవికో కొప్పోలు త్రిపురాంతకుడు,
నాగళ్ళ చిట్టప్ప అనే శిష్యులు ఉండేవారు. వాళ్ళు తమ గురువుగారిపై ఈగవాలనిచ్చేవారుకాదు.
ఈ రుద్రకవి చాలామంది సమకాలికులతో తగాదాలు పెట్టుకునేవాడు. వాళ్ళలో ప్రెగడరాజు
నరసయ్య, వరకవి కొండయ్య అనే మామా అల్లుళ్లూ, భద్ర మంత్రి అనే మరొకడూ
ముఖ్యులు. వీళ్ళలో వరకవి కొండయ్య ఇలా రుద్రకవి చేత తిట్లుతిన్నాడు.

విదితంబుగ గవి రుద్రుని
సదమల వాగ్జనిత శాస్త్రసంహిత పదముల్
కుదిరిక తెలియక యూరక
వదరకురా వెర్రిముండ! వరకవి కొండా.

రుద్రకవి వాడే శాస్త్ర సంహిత పదాలు చాలామందికి తెలియవు. అయితే అతడు
పామరజనాన్ని హడలకొట్టడానికి పాణినీయంలోని వ్యాకరణ సూత్రాలను యాకరువు
పెట్టేవాడని, అవి విని గాభరాపడ్డవాళ్ళ చేతిపైకం ఈ రుద్రకవి దోచుకొనేవాడనీ
భద్రమంత్రి ఆరోపించి ఈ పద్యం చెప్పాడు:

జబగడదష్ణు, లణ్ణు, శషసర్రు, కపయ్య ఝుభ, ఞ టండు వా
జబజబలెల్ల జేసి యగసాలెల బేలల మోయపాలెపుం
బబువుల దేల్చి చేతగల పైకము దోచుటగాదు రుద్ర! నీ
డబడబ భద్రమంత్రి యెదుటం గొనసాగదు పోకు పోకుమీ!

ఇంత ధైర్యంచేసి రుద్రకవిని నిలబెట్టినా భద్రమంత్రిని కొప్పోలు తిప్పన ఇలా
తిట్టాడు:

భద్రా! శ్వానము మొరిన
రుద్రాంకిత జంగమయ్య రూఢికి గొదువా?
చిద్రూపు డయిన సాక్షా
ద్రుద్రుడయా కందుకూరి రుద్రుడు ధాత్రిన్.

వెంటనే నాగళ్ళ చిట్టప్ప ఇలా చీవాట్లు పెట్టాడు:

రుద్రకవి వాక్పటుత్వము
భద్రప్రదయుక్తి దనరు భాసుర లీలన్
రుద్ర స్వరూపు నెదురను
క్షుద్రు లెదురొక్కనగ గలరె కుంభినిలోనన్.

కొందరు కవులతో వివాదాలు పెట్టుకొన్నా రుద్రకవి చాలా సత్కారాలు పొందాడు. అతనిపై ఎవరో ఇలా పద్యం చెప్పారు:

హరియూ స్కంధపురీ జనార్దను వరంబందెన్ మహా సత్కవీ
శ్వరు లా రాయలవారి సన్నిధిని హర్షంబందె బట్టంబు గ
ట్టిరి యాందోళికలున్ జవోగ్రతర ఘోటీ లగ్రహారంబు లం
దరు చూడన్ బహుమానమందె గవి రుద్రాఖ్యుండు తా ముఖ్యుడై.

ఈ చాటువులోని రుద్రకవి హరియైన జనార్దనుని వరం పొందాడని తెలుస్తోంది. బహుశా ఇతడే 'బలవదరీ దరీ కుహర భాస్వదరీయ దరీ దరీహరీ!' అనే మకుటంలో ఒక శతకం చెప్పి ఉంటాడు. ఈ శతకం పూర్తిగా దొరకలేదు. మూడు పద్యాలను మాత్రం వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉదాహరించారు.1

అల పగవాని తమ్ముడు భయంకరుడై చనుదెంచినంతనే
బళిబళి వచ్చితీవనుచు బట్టముగట్టవె లంక కప్పుడే
కొలిచిన నిన్ను కొల్వవలె గోరికలిచ్చిన నీవె యీవలెన్
బలవదరీ దరీ కుహర భాస్వదరీయ దరీదరీ హరీ!

కలశపయోధిమూదఁ దరగల్ మరిహోరని భ్రమోయ, వేయుభం
గుల తలపాన్పు పాము బుసకొట్టగ నేగతి నిద్ర చెందెదో
యలసత దండ్రి! చీమ చిటుకన్నను నిద్దుర రాదు మాకు నో
బలవదరీ దరీ కుహర భాస్వదరీయ దరీదరీ హరీ!

కలుష సరిత్తరీ పుషితగంధకరీ మహిభృత్కరీ భావా
చలభిదురీ దయారస విశాలఝరీ నిగమార్థమాధురీ
ఖలగజకేసరీ విభవకంపిత మేరుగిరీ లతాదరీ
బలవదరీ దరీకుహర భాస్వదరీయ దరీదరీ హరీ!

ఈ మూడూ కాక మరొకటి ఈ మకుటంలో ఉన్నదే చాటుపద్య మణిమంజరి ప్రథమ భాగంలో ఉంది.2 ఇది కూడా రుద్రకవి శతకంలోనిదే.

పిలువని కూటికిన్ వెతలబెట్టు ధరావరు డేలు వీటికిన్
జలములు లేని యేటికిని సారెకు బందుగు లున్న చోటికిన్
బలువురుతోటి పోటికి నృపాలుర సాటికి బోవరాదయా
బలవదరీ దరీకుహర భాస్వదరీయ దరీదరీ హరీ!

---

1. చాటుపద్య మణిమంజరి-రెండవ భాగం. పుట 119.
2. పుట 202

ఇంత చక్కగా చెప్పిన ఈ శతకం పూర్తిగా దొరికితే బాగుండును. రుద్రకవి ఈ శతకంలోని మకుటం ఇతర కవులకు మార్గదర్శకమైంది. "ధరశరధీ! రథీశనుత, దాశరథీ, ధరధీర, ధీరథీ" అని మకుటంతో మోదుకూరి శంకరయ్య కూడా ఒక శతకం వ్రాశాడు. అయితే అది కూడా పూర్తిగా దొరకలేదు.1 'బలవదరీ' శతకం చెప్పిన రుద్రకవే, బహుశా కందుకూరి జనార్దనునిపై పంచరత్నాలను కూడా చెప్పాడు. ఇవి పంచచామరాలు. సోమేశ్వరునిపై చెప్పిన పద్యాలతోపాటు ఇవి 'రుద్రకవి గ్రంథం' అనే వ్రాతప్రతిలో ఉన్నాయి. [R. 764]

ఈ ఒక్క ప్రతితో వీటిని పరిష్కరించడం కష్టం. ఒక్క జనార్దన పంచచామరాన్ని వేటూరి వారు ప్రచురించారు.2

సోమేశ్వర పంచరత్నాలలో ఒకటి చూడండి :

నందికేశవాహ! నిన్ను నమ్మి కొల్చువారికీ
యెందు లేవు? నంబి పూజలిచ్చి నొచ్చి పిల్వగా
నందగ త్తె చంట బల్క-వా యహోయటంచు మా
కందుకూరి సోమలింగ! కామదర్ప భంజనా.

ఈ పంచ రత్నాలను వ్రాసిన రుద్రకవే జనార్దనాకాష్టన్ని కూడా వ్రాసి ఉంటాడు. బహుశా ఇతడు యక్షగానం వ్రాసిన రుద్రకవే కావచ్చును. యక్షగానంలో రుద్రకవి జనార్దనుణ్ణి దశావతారాలు ఎత్తిన దైవంగా ఇలా షష్యంతాలలో నుతించాడు.

చదువులు దెచ్చిన జలచర పతికిన్
కుధరము మోచిన కూర్మంబునకున్
మేదిని దాల్చిన యాదిమకిటికిన్
కనక కశిపు దునిమిన నరహరికిన్
బలి నణచిన యా యలవడుగునకున్
మనుజేశుల గొట్టిన రామునకున్
రావణు జంపిన రఘువర్యునకున్
భానుజు గూల్చిన బలభద్రునకున్
దనుజ సతుల దగిలిన బుద్ధునకున్
ఖలు నణంపగల కల్క్యా కృతికిన్
సర్వము తానగు జన్నప్పనికిన్.

జన్నప్ప అనే మాట జనార్దనుడనే మాటకు వికృతి. రుద్రకవి దృష్టిలో జన్నప్ప దశావతారాలను ఎత్తిన పరదైనం. అయితే జనార్దనుడు మాత్రం విష్ణుమూర్తి యొక్క అనేక రూపాలలో ఒక రూపం; సహస్రనామాలలో ఒక నామం. ఈ దైవం గురించి కొద్దిగా మనవి చేస్తాను.

---

1. శంకరయ్య పద్యాలు రెండింటిని దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు తమ చాటుపద్య రత్నాకరంలో ఉదహరించారు. నెం. 91, 92.
2. చాటుపద్య మణిమంజరి II పుట 120.

3

జనార్దనుడు:

విష్ణు సహస్రనామాలలోనే కాక నామాలిం గానుశాసనంలో అమరసింహుడు చెప్పిన 39 పేర్లతో ఇది ఉంది. సంధ్యావందనం చేసేవాళ్ళు రోజూ జపించే ఇరవై నాలుగు కేశవ నామాలలో కూడా జనార్దనుని పేరుంది. విష్ణువు కీ పేరెలా వచ్చింది? ఈ మాట కర్థం ఏమిటి? అని తర్కించడం అవసరమే. నిఘంటువు చూస్తే ఇలా ఉంటుంది.

"జనార్దనుఁడు. సం. విణ (అ. ఆ. అ) జనులను పీడించువాడు.
వి. అ. పు. పురుషార్థ లాభముకై జనులచేత యాచింపబడువాడు;
జనమును (=జన్మమును) నశింపఁ జేయువాడు—విష్ణువు."

[సూర్యరాయాంధ్ర నిఘంటువు

జనులను పీడించేవాడు దేవుడెలా అవుతాడు? అనే ప్రశ్న ఉదయించడం సహజమే. శత్రు జనులను పీడించి అయిన వాళ్ళకు మేలు కలిగించిన ఆదిమ వీరులలో జనార్దనుడు, బహుశా, ఒకడై ఉంటాడని భావించవచ్చును. జనార్దనుడు దేవీ సహోదరుడు. హిరణ్యాలతో పోరాడి వాళ్ళను సంహరించాడని బ్రహ్మాండ పురాణం వల్ల తెలుస్తుంది. (బ II-29. 103, 113) జనార్దనుడే కల్కి రూపంలో హూణులను యవనులను మర్దించాడని బ్రహ్మాండ పురాణంలోనే కనబడుతుంది. (బ II 39-49).

హయగ్రీవ రూపాన్ని ధరించిన జనార్దనుడు కంచిలో అగస్త్యునికి దర్శన మిచ్చాడని కూడా ఈ పురాణమే చెప్తుంది. ఒక్క బ్రహ్మాండ పురాణంలోనే కాక వాయు, విష్ణు పురాణాలలో కూడా జనార్దనుని ప్రస క్తి ఉంది.1

---

1. ఈ వివరాలన్నీ వి. ఆర్. రామచంద్ర దీక్షితులుగారి పురాణ సూచిక వల్ల తెలుస్తాయి.

వాసుదేవుని లాగే జనార్దనుడు కూడా అత్యంత ప్రాచీన పురుషుడని చెప్పవచ్చు. మన దేశంలో వాసుదేవ మతం పాణిని కాలానికి ముందే చాలా ప్రచారంలో ఉంది. పాణిని క్రీస్తు పూర్వం 7వ శతాబ్దం వాడు. వాసుదేవుని వంటి ప్రాచీన వ్యక్తుల జీవితగాధలే మనకు ఇతిహాస పురాణాలైనాయి. కాలం పెరుగుతున్న కొద్దీ వివిధ పురాణ వీరుల వ్యక్తిత్వాలు సంకేతాలుగా మారి ఆ సంకేతాలన్నింటికీ ఏకత్వం రూపించే ప్రయత్నాలు జరిగాయని భావించవచ్చు. వివిధ ప్రాచీన వీరులు వాసుదేవుని మూర్తులయ్యారు. జనార్దనుడనే పేరు విష్ణువుకు నామాంతరమైంది. ఇది చారిత్రక పద్ధతిలో చెప్పుకోవలసిన తీరు. ఆదికాలంలోని మన పితృదేవతలే కాలక్రమేణా దేవతలుగా మారడంలో వింత లేదు. ఇంతకూ గయలో జనార్దనుడే పితృదేవతల రూపాన ఉంటాడని వాయుపురాణం చెప్తుంది.1

ఆధునిక పద్ధతుల ప్రకారం ఇలా ఊహించినా ఆగమాల ప్రకారం జనార్దనుని సంగతి బోలెడంత తెలుసుకోవచ్చు. ఆగమాలంటే పూజా పురస్కారాలను చెప్పే శాస్త్రాలు. ఏ దేవాలయం ఎలా కట్టాలో, ఏ విగ్రహం ఎలా చెక్కాలో ఏ పూజ ఎలా చెయ్యాలో ఆగమాలు బోధిస్తాయి. వైష్ణవాగమాలవల్ల జనార్దన స్వరూపం అవగతమవుతుంది. వాసుదేవుడు చతుర్వింశతి మూర్తులయ్యాడని వైష్ణవులు విశ్వసిస్తారు. ఈ ఇరవైనాలుగు మూర్తులూ ఎలా ఏర్పడ్డాయో తెలుసుకొందాం.

వైష్ణవాగమాల ప్రకారం వాసుదేవుడే బ్రహ్మం. అందుకే ఇతణ్ణి పరవాసుదేవుడంటారు. జ్ఞానం, శక్తి, బలం, ఐశ్వర్యం, వీర్యం, తేజస్సు అనే షడ్గుణాలలో ఈ పరతత్త్వం నిండి ఉంటుంది. పరవాసుదేవుడు నిర్దోషుడు. ఇతడు కొన్ని కార్యాలకోసం కొన్ని వైభవమూర్తు లవుతాడు. ఇవి దశావతారాలవంటివని చెప్తే సులభంగా బోధపడుతుంది గాని ఈ వాసుదేవ రూపాంతరాలకూ అవతారాలకూ చాలాతేడా ఉంది. ఈ వైభవ మూర్తులను వ్యూహాలంటారు. అవతారం ఎత్తడానికి పరమాత్మ జన్మమొందుతాడు. వ్యూహంగా ఏర్పడడానికి అతడు అవతరించనక్కర్లేదు; అధిష్ఠించుతాడు.

---

1. వాయు: 108-85, 89 : 109-24, 34.

షడ్గుణాలతో పరిపూర్ణంగా ఉండే పరవాసుదేవుడు, ఆ ఆరుగుణాలను రెండేపి రెండేసి చొప్పున విభజించి మూడు వ్యూహాలుగా ఏర్పడ్డాడు. వాటి వివరాలు ఇవి:

1. వాసుదేవుడు — షడ్గుణ పరిపూర్ణుడు.
2. సంకర్షణుడు — జ్ఞాన బలాలు.
3. ప్రద్యుమ్నుడు — ఐశ్వర్య వీర్యాలు.
4. అనిరుద్ధుడు — శక్తి తేజస్సులు.

ఈ నాలుగు విభవ వైభవ మూర్తులను ప్రధాన వ్యూహాలంటారు. వీటినుండి ఉపవ్యూహాలు ఆవిర్భవించాయి. ఒక్కొక్క ప్రధాన వ్యూహంనుండి మూడేసి ఉప వ్యూహాలు ఏర్పడ్డాయి. వాటి వివరాలు ఇవి:

1. వాసుదేవుని నుండి	1. కేశవుడు
	2. నారాయణుడు
	3. మాధవుడు
2. సంకర్షణుని నుండి	4. గోవిందుడు
	5. విష్ణువు
	6. మధుసూదనుడు
3. ప్రద్యుమ్నుని నుండి	7. త్రివిక్రముడు
	8. వామనుడు
	9. శ్రీధరుడు
4. అనిరుద్ధుని నుండి	10. హృషీకేశుడు
	11. పద్మనాభుడు
	12. దామోదరుడు

ఈ ఉపవ్యూహాలపేర్లే ఆస్తికులు సంధ్యావందనంలో జపించే కేశవనామాలలోని ద్వాదశ మూర్తులపేర్లు. ఈ ఉపవ్యూహాలనుండి మళ్ళా వేరే వైభవ మూర్తులు ఏర్పడ్డారు. వాళ్ళ పేర్లు చూడండి:

1. పురుషోత్తముడు	5. జనార్దనుడు
2. అధోక్షజుడు	6. ఉపేంద్రుడు
3. నారసింహుడు	7. హరి
4. అచ్యుతుడు	8. శ్రీకృష్ణుడు

నాలుగు ప్రధాన వ్యూహాలు, పన్నెండు ఉపవ్యూహాలు, ఎనిమిది తద్భవ వ్యూహాలూ కలుపుకొని మొత్తం ఇరవైనాలుగు వైభవ మూర్తులు ఏర్పడుతున్నారు. పురుషోత్తమునిలోంచి జనార్దనుడు ఏర్పడ్డాడని బృహత్ బ్రహ్మ సంహిత చెప్తోంది.1 ఈ ఇరవైనాలుగు వైభవ మూర్తులకూ ప్రత్యేకమైన విగ్రహాలున్నాయి.

ప్రతిమల లక్షణాలు తెలియని సాధారణ ప్రేక్షకుని కళ్ళకు ఈ విగ్రహాలన్నీ ఒకలాగే ఉన్నట్టు కనబడతాయి. అన్నీ నిలబడే ఉంటాయి. అన్నింటికీ కిరీటా లుంటాయి, ఆభరణా లుంటాయి, నాలుగు చేతు లుంటాయి, ఆ చేతుల్లో శంఖ చక్ర గదా పద్మాలు ఉంటాయి. అయితే ఏ విగ్రహం ఏ మూర్తిదో ఎలా చెప్పడం? అంటే దానికో సులువు సూత్రం ఉంది. ఆయుధ ధారణలో ఏ విగ్రహమూ ఇంకో విగ్రహంలాగ ఉండదు. నాలుగు చేతులలో నాలుగురకాల ఆయుధాలు ధరించేటప్పుడు ఒకసారి పట్టుకొన్న క్రమంలో మళ్ళా ఆ ఆయుధాలు పట్టుకోకుండా వరుసమార్పులు చేసుకొంటూ పోతే ఇరవైనాలుగు రకాలుగా ధరించవచ్చును. చతుర్వింశతి వైభవమూర్తులలో ఇదే లెక్క- టక్కున సరిపోతుంది.

కేశవమూర్తి పై కుడిచేతిలో శంఖం, పై ఎడమ చేతిలో చక్రం, కింది ఎడమచేతిలో గద, కింది కుడిచేతిలో పద్మం ఉంటాయి. ఈ వరుస వాచిముల్లుల ప్రదక్షిణక్రమంలో చెప్పుకొన్నాం. మాధవుడి చేతుల్లో ఈ క్రమం ఉండదు. మాధవుడన్న మాటేమిటి, మరే విగ్రహం చేతులలోనూ ఉండదు. ఈ గణిత సూత్రం ప్రకారం వరస మార్పు చేసుకొంటూపోతే ఏ యే మూర్తుల ఆయుధాలు ఏ క్రమంలో ఉండేది పక్క- పుటలో చూడండి. ఈ పట్టిక ప్రకారం జనార్దనుని చేతులలో ఏయే ఆయుధా లుంటాయో ఇలా తేలుతుంది:

పై-కుడిచేతిలో	:	చక్రం
పై-ఎడమచేతిలో	:	శంఖం
కింది-ఎడమచేతిలో	:	గద
కింది-కుడిచేతిలో	:	పద్మం

ఈ విధంగా ఆయుధాలను పట్టుకొన్న విగ్రహం జనార్దనుడని మనం సులభంగా పోల్చుకోవచ్చును; గాని ఒక ఆగమం నిర్దేశించినట్టూ మరో ఆగమం నిర్దేశించదు. వైష్ణవ ఆగమాలలోనే పాంచరాత్రమనీ వైఖానసమనీ విభేదాలులున్నాయి. ఇవికాక పురాణాలలో

---

1. గోపీనాథరావుగారి 'ఎలిమెంట్స్ ఆఫ్ ఇండియన్ ఐకొనాగ్రఫీ' ప్రథమసంపుటి-పుట 237.

రూపమండనం ప్రకారం - వైభవమూర్తుల లక్షణాలు.

వరుస సెం.	వైభవమూర్తి	కుడి పై చేయి	ఎడమ పై చేయి	ఎడమ కిందిచేయి	కుడి కింది చేయి
1.	కేశవ	శంఖం	చక్రం	గద	పద్మం
2.	నారాయణ	పద్మం	గద	చక్రం	శంఖం
3.	మాధవ	చక్రం	శంఖం	పద్మం	గద
4.	గోవింద	గద	పద్మం	శంఖం	చక్రం
5.	విష్ణు	పద్మం	శంఖం	చక్రం	గద
6.	మధుసూదన	శంఖం	పద్మం	గద	చక్రం
7.	తివిక్రమ	గద	చక్రం	శంఖం	పద్మం
8.	వామన	చక్రం	గద	పద్మం	శంఖం
9.	శ్రీధర	చక్రం	గద	శంఖం	పద్మం
10.	హృషీకేశ	చక్రం	పద్మం	శంఖం	గద
11.	పద్మనాభ	పద్మం	చక్రం	గద	శంఖం
12.	దామోదర	శంఖం	గద	చక్రం	పద్మం
13.	సంకర్షణ	శంఖం	పద్మం	చక్రం	గద
14.	వాసుదేవ	శంఖం	చక్రం	పద్మం	గద
15.	ప్రద్యుమ్న	శంఖం	గద	పద్మం	చక్రం
16.	అనిరుద్ధ	గద	శంఖం	పద్మం	చక్రం
17.	పురుషోత్తమ	పద్మం	శంఖం	గద	చక్రం
18.	అధోక్షజ	గద	శంఖం	చక్రం	పద్మం
19.	నారసింహ	పద్మం	గద	శంఖం	చక్రం
20.	అచ్యుత	పద్మం	చక్రం	శంఖం	గద
21.	జనార్ధన	చక్రం	శంఖం	గద	పద్మం
22.	ఉపేంద్ర	గద	చక్రం	పద్మం	శంఖం
23.	హరి	చక్రం	పద్మం	గద	శంఖం
24.	శ్రీకృష్ణ	గద	పద్మం	చక్రం	శంఖం

కూడా విగ్రహలక్షణాలను వివరించే శ్లోకాలున్నాయి. పద్మ పురాణంలోని పాతాళ ఖండంలో చెప్పిన దాని ప్రకారం జనార్దన విగ్రహం ఆయుధాలు ఈ విధంగా ఉంటాయట.

పై-కుడిచేతిలో : పద్మం

పై-ఎడమచేతిలో : చక్రం

క్రింది-ఎడమచేతిలో : శంఖం

క్రింది-కుడిచేతిలో : గద

ఈ ఆగమ శాస్త్రాలూ ఇలా చెప్తున్నా కందుకూరులోని జనార్దన విగ్రహం మాత్రం విలక్షణంగా ఉంది. ఆ దైవం కింది కుడిచేతిలోనే కాదు ఎక్కడా పద్మం లేదు. పై కుడిచేతిలో చక్రం, పై ఎడమచేతిలో శంఖం, కింది ఎడమచేతిలో గదా ఉన్నాయి. కింది కుడిచేయి అభయ హస్తం. మూలవిగ్రహం లాగే ఉత్సవ విగ్రహం కూడా ఉంది. రాయసం కొండ మరుసయ్యగారి శాసనంలో "శ్రీమత్సకల లోకేశ శంఖ చక్ర గదాధర కందుకూరి పురాన్తైక జనార్దన నమోస్తుతే" అని పద్మరహితంగా దేవుణ్ణి నుతించడం గమనించదగ విషయం.

ఒక్క కందుకూరులోనే కాక చుండిలోని జనార్దన విగ్రహంకూడా పద్మరహితంగానే ఉంది. అక్కడ కూడా కింది కుడిచేయి అభయ హస్తమే, చుండి జనార్దన ప్రతిష్ఠ క్రీ. శ. 1408 లో జరిగింది. కందుకూరులోని ఆలయమే ప్రాచీనం. దీనినే చుండిలోని ఆలయ నిర్మాతలు అనుసరించి ఉంటారు. పాకనాడులో ఈ రెండు చోట్లలోనే కాక జిల్లేళ్ళమూడిలో, నర్రవాడలో కూడా జనార్దనోత్సవాలు జరిపేవారు. అక్కడి విగ్రహాలు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. విశాఖమండలంలోని జామిలో కూడా జనార్దనాలయం ఉంది. ఇక్కడి మూర్తిని కూడా చూడాలి.

ఒకే విగ్రహ రూపకల్పనలో ఇన్ని తేడా లెందుకొచ్చాయంటే వివిధ వ్యక్తులు వివిధాగమాలు వ్రాయడం వల్లనే అని చెప్పాలి. ఒక పరతత్త్వానికి అనేక రూపాలను ఊహించుకొని గణితశాస్త్రరీత్యా వీలైనన్ని తీరులు మలచేటప్పుడు లెక్కలేనన్ని పద్ధతులు ఏర్పడవచ్చును. ఏ ఆగమం ప్రామాణికం అంటే ఎవరి మతం వాళ్ళకి గొప్ప! వైఖానసులు తమ ఆగమమే పాంచరాత్రుల ఆగమం కన్నా మిన్న అంటారు. వైష్ణవులు

ఇలా విభేదాలతో ఉంటే వైష్ణవేతరులు అసలు, ఈ వైభవమూర్తులన్నీ మా దేవరనుండి వచ్చినవే అంటారు. మార్కండేయ పురాణం దేవీ మాహాత్మ్యాన్ని ఉగ్గడిస్తుంది. కృష్ణ, హృషీకేశ, వాసుదేవ, జనార్దను లనే మూర్తులు దేవినుండి ఉద్భవించాయని ఆ పురాణం చెప్తుంది.1

నిర్దుష్టమైన సంస్కృతంలో నాలుగు శ్లోకాలు వ్రాయగలిగిన ప్రతి ఒక్కడూ తన కభిమతమైన విషయాలను వ్రాసి పాత పురాణాలలో చొప్పించి అది వ్యాసప్రోక్తం అనడం వల్ల ఎన్నో తికమకలే కాక అనర్థాలూ వాటిల్లుతాయి. మనుష్యులకే కాక దేవతలకు కూడా వర్ణాశ్రమ ధర్మాల కట్టుబాట్లు మన పెద్దలు ప్రసాదించారు. ప్రతీ దేవుణ్ణీ ప్రతీ కులంవాడూ పూజించకూడదట. రూపమండనం అనే ప్రమాణం ప్రకారం బ్రాహ్మణులు కేశవ, నారాయణ, మాధవ మధుసూదన మూర్తులను అర్చించాలట. వైశ్యులు తివిక్రమ వామనులను కొలుచుకోవాలట. శూద్రులు శ్రీధరుణ్ణే సేవించాలట. అష్టాదశవర్ణాలలోని మిగతా కులాల వాళ్ళు పూజించవలసిన వైభవమూర్తుల వివరాలు రూపమండనంలో ఉన్నాయి.2 జనార్దనుణ్ణి ఏ ప్రత్యేక కులంవాళ్ళు కొలుచుకోవాలో నాకు కనబడలేదు.

ఇతరేతర ప్రామాణికులు ఏం చెప్పినా తెలుగు దేశంలో ముఖ్యంగా పాకనాడులో అన్ని వర్ణాలవారూ ఒకప్పుడు జనార్దనుణ్ణి పూజించేవారు. ఈ దేవుడి పేరు పెట్టుకొనేవారు. తెలుగు సాహిత్యంలో ఈ పేరుగల కవులు కూడా కొందరు ప్రసిద్ధులు ఉన్నారు. 'కష్ణా! దేవకీనందనా!' అనే శతకాన్ని వెన్నలకంటి జన్నమంత్రి వ్రాశాడు. జన్నయ్య అనే మాట జనార్దన శబ్దభవం. నెల్లూరు జిల్లాలో ఈ వైభవమూర్తికి ఆలయాలూ వృత్తులూ మాత్రమే కాక ఏటేటా జాతరలు కూడా జరిగేవి. ఉదయగిరి తాలూకా నర్రవాడలో ప్రతి ఏప్రైలు మాసంలో జనార్దనస్వామి వారి జాతర చేస్తారని జిల్లా మాన్యువల్ వల్ల తెలుస్తుంది.3 ఈ జాతరలలోనూ ఇతర ఉత్సవాలలోనూ రుద్రకవి రచించిన పంచరత్నాలూ, అష్టకం భక్తులు పాడేవారేమో. తెలుగులోని అష్టకాలలో, బహుశా జనార్దనాష్టకమే ప్రథమం. దానిని గురించి చెప్పుకోడానికి ముందు అష్టకాల పరిణామం పరిశీలిద్దాం.

---

1. గోపీనాథరావు గారి 'ఐకొనాగ్రఫీ' ద్వితీయ సంపుటి. పుట 336.
2. గోపీనాథరావు గారి "ఐకొనాగ్రఫీ" ప్రథమ సంపుటి. పుట 237
3. నెల్లూరు మాన్యువల్-జూన్-ఏ. సి. బాస్వెల్ పండుగుల ప్రకరణం.

4

అష్టకం

సంస్కృతంలో చాలా అష్టకా లున్నాయి. ఇవి ముఖ్యంగా స్తోత్రాల రూపంలో ఉంటాయి. సంఖ్యానియమంగల రచనా విశేషాలలో అష్టకం ఒకటి. అయిదు పద్యాల రచనను పంచరత్నా లంటారు. అలాగే ఎనిమిది పద్యాలున్న రచనను వారణమాల అంటారు. అయితే వారణమాలలో సంఖ్యానియమమే గాని మకుటనియమం లేదేమో. మకుటనియమం గల ఎనిమిది పద్యాల మాలికను అష్టకం అంటారు.

తెలుగు దేశంలోని చాలామంది ఆస్తికులు నిత్యం సంస్కృతాష్టకాలను పఠించడం ఇప్పటికీ వినబడుతుంది. కాలభైరవాష్టకం, లింగాష్టకం, అన్నపూర్ణాష్టకం, జగన్నాథాష్టకం మొదలైనవి సుప్రసిద్ధాలు. వావిళ్ళ వారు ప్రకటించిన బృహత్ స్తోత్ర రత్నాకరం మూడు సంపుటాలలో 92 అష్టకాలు లభిస్తున్నాయి. శంకరాచార్యులవారు, విద్యారణ్యులు, వల్లభాచార్యులు మొదలైనవారు బహుళాష్టక రచయితలు. పరమహంస బ్రహ్మానందులే సుమారు పది అష్టకాలు వ్రాశారు. ఈ సంస్కృతాష్టకా లన్నింటిలో ప్రతి శ్లోకంలోని చివరి పాదంలో కొంత భాగంగాని, పూర్తిగా గాని మకుటం ఉంటుంది.

సంస్కృతాష్టకాలను పరిశీలించితే సంఖ్యానియమం, మకుటనియమం మాత్రమే కనబడతాయిగాని అష్టకాలను ఫలానా రకం ఛందస్సులోనే వ్రాయాలనే పట్టింపులేదు. శార్దూలాలు, పంచచామరాలు భుజంగ ప్రయాతాలు మొదలైన వివిధ ఛందో భేదాలలో ఈ రచనలు కనబడతాయి. సంస్కృత వాఙ్మయంలో అష్టకాలు ఎప్పుడు ప్రవేశించాయో తెలియదు.

బృహత్ స్తోత్ర రత్నాకరంలోని కొన్ని అష్టకాల రచయితల పేర్లు ఇంద్రుడు, శుక్రుడు, దూర్వాసుడు అని ఉన్నా, ఈ పురాణ పురుషులు కాక, మానవమాత్రులలో ఎవరు అష్టక రచనలో ప్రాచీనులో తెలిస్తే అప్పటినుంచీ ఈ రచనా ప్రక్రియ మొదలయిందని చెప్పవచ్చును. తెలిసినంత మట్టుకు 'పరచిదంబరనటం హృది భజ' అనే తాండవాష్టకాన్ని వ్రాసిన పతంజలీ, వ్యాకర్త పతంజలీ ఒక్కరే అయితే ఇదే ప్రాచీనాష్టకం అని చెప్పాలి. అయితే ఇది సులభంగా తేలే ప్రశ్నకాదు. సంస్కృత వాఙ్మయ పరిశోధకులు గట్టిగా పరిశీలించి చెప్పవలసిన సంగతి.

సంస్కృత వాఙ్మయంలోనే ఎనిమిది చరణాల నియమంగల ఇంకోరచన ఉంది. దానిని అష్టపది అంటారు. జయదేవుడు గీతగోవిందం ఈ ఛందస్సులోనే వ్రాశాడు. తెలుగు లక్షణ కర్తలు చాలామంది సంస్కృత ఛందో గ్రంథాలను అనుసరించినా అష్టపది లక్షణాన్నిగానీ అష్టకం విషయంగానీ, పొత్తపి వెంకటరమణ దాకా, ఎవరూ చెప్పలేదు. కన్నడంలో మాత్రం దీని గురించి చెప్పారు. ఛందోంబుధిలో అష్టపది లక్షణంఉంది:1 కన్నడ అష్టపది ఏకతాళజాతికి చెందినది. చతుర్మాత్రా గణాలు రెండు ప్రతీపాదంలోనూ ఉంటాయి. ఇలాంటివి 8 పాదాలు ఉంటాయి. ప్రతి పాదంలోనూ ఆదిప్రాసనియమం ఉంది. కిట్టల్ దొరగారు రెండు మూడు రకాల కన్నడ అష్టపదులను ఉదాహరించారు.

ఈ అష్టపదినే నాలుగు పాదాల చరణంగా మార్చుకొంటే ప్రతిపాదంలోనూ 16 మాత్రలు ఉంటాయి. తెలుగులో పదహారు మాత్రలుగల ఛందస్సు మధురగతి రగడ. అయితే ఒక్క మధురగతిలోనే కాక ఇతర రగడ భేదాలలో కూడా తెలుగు అష్టకాలు కనబడతాయి. 'యష్టిగానాష్ట పదాష్ట పములు నాలుగు విధమ్ములు నొక్కొక్కటి పెక్కు విధమ్ములై యష్టకమ్ముల పదంబులు, నష్ట పదులును వివిధ రీతులు నానా ముఖంబుల విహరించు" అని పొత్తపి వెంకటరమణ తన లక్షణ శిరోమణిలో 3వ ఆశ్వాసంలో చెప్పాడు. **(R. 1257)2** ఈ అష్టకాలలోమొదటి రచన పరమానందతీర్థులు రచించిన ముక్తికాంతా పరిణయంలో కనబడే తెలుగు మంగళాష్టకాలు అని చెప్పవచ్చు. చూడండి.

శ్రీ విభుడును బ్రహ్మ శివు డనాదియైన
దేవతలును మునులు దిక్పాలకులును
నివేళ మీరంద రేకమై బ్రోవుడు
కేవల నిజసుఖకేళీ ముహూర్త మిపుడు

ఆయత్తమా సర్వాయత్తమా

స్థిరముగ సప్తమాతృకలు విఘ్నేశుడు
పరగ షణ్ముఖు లష్ట భైరవు లందరు
కరమర్థి నేతెంచి కాచి రక్షింతురు
గరిమెతో నపవర్గ కల్యాణమిప్పుడు॥

ఆయత్తమా సర్వాయత్తమా

---

1. తెలుగు భాషలో ఛందోరీతులు-రావూరి దొరస్వామిశర్మగారు. పుట 179.
2. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర. ప్రథమ భాగంలో యస్వీ జోగారావుగారు ఉదహరించారు. పుట 315.

అత్యంతముగ మాయా నిర్మితంబైన
ప్రత్యయమును చాల బ్రబలి చేయునట్టి
కృత్యములెల్లను కినిసి లో గొన్నట్టి
సత్యచిత్ప్రకాశ సంపూర్ణంబున

కాయత్తమూ సర్వాయత్తమూ

సంస్కృతంలోని మంగళాష్టకాలను పరమానంద తీర్థులు కన్నడ గ్రంథాల ప్రభావంతో తెలుగులోనికి దింపినట్టు కనబడుతుంది. మన పెళ్ళిళ్ళలో లగ్నానికి ముందు కాలహరణం చేయవలసి వస్తే మన పురోహితులు సావధాన అంటూ సంస్కృత మంగళాష్టకాలు చదవడం సర్వసామాన్యమే. వాటిలో 'కుర్వంతు వాం మంగళం' అనేది మకుటం. ఒకటి చూడండి:

గంగా సింధు సరస్వతీచ యమునా గోదావరీ నర్మదా
కృష్ణా భీమరథీచ ఫల్గు సరయూ: శ్రీగండకీ గోమతీ
కావేరీ కపిలా ప్రయాగ నిరతా వేత్రావతీ త్యాదయో
సర్వశ్శ్రీహరి పాదపంకజ భవా: కుర్వంతు వాం మంగళం.1

తెలుగు పెళ్ళిళ్ళలో మంగళాష్టకాలు ఎప్పట్నుంచీ చదివేవారో తెలియనుగానీ వీటి ప్రస క్తి మన ప్రబంధాలలో ఆరవీటి రాజుల యుగంలోనే కనబడుతుంది. సిద్ధిరాజు తిమ్మరాజు వ్రాసిన పరమయోగి విలాసంలోని పెళ్ళి వర్ణనలో తొలిసారి మంగళాష్టకాల ప్రస క్తి చదివినట్టు జ్ఞాపకం.

రంగాజమ్మ మన్నారుదాస విలాస ప్రబంధంలో విజయరాఘవుని కల్యాణంలో మంగళాష్టకాలను పేర్కొంది.

ఘన వాద్యంబులు మ్రోయుగఁ
దనరఁగ ముత్తైవులును ధవళము బాడన్
మొనసి పురోహితు లప్పుడు
ఘనతరముగ మంగళాష్టకంబులు చదువన్.

[మన్నారు ప్రబంధం 5-41.

ఈ ప్రబంధాన్నే రంగాజమ్మ యక్షగానంగా మార్చి అందులో ధవళాలు శోభనాలు పాడించిందేగాని మంగళాష్టకాలను చదివించలేదు. అయితే ఆ తరువాత తంజావూరు

---

1. బహత్స్తోత్ర రత్నాకరం-ద్వితీయ భాగం పుట 461.

నాటకరంగం మీద పెళ్ళిజరిగే ప్రతి దృశ్యకావ్యంలో విదూషకుడో, మరెవరో మంగళాష్టకాలు చదవడం పరిపాటే. హాస్యంతో, అపహాస్యంతో శ్రుతిమించి ఆశ్లీలంగా కూడా లగ్నాష్టకాలను ఆ నాటకాలలో చదివేవారు. వాసుదేవకవి వ్రాసిన పార్వతీపరిణయంలో'అన్నాదమ్ముడు కూడుకుని యొక త్రెకున్ కుర్వంతు వాంమైధునం' అనే క్షుద్రబూతుల మంగళాష్టకం కూడా ఉంది.1 ఇంత పచ్చిగా కాక మృదువుగా హాస్యధోరణిలో నిన్నటిదాకా కొన్ని పెళ్ళిళ్ళలో మంగళాష్టకాలు ఇలా చదివేవారు.2

గూనాబల్లా చాకలాడిదై తే బట్టయితే మందేకదా
ఉతికేటందుకు వాడి యిష్టమే కదా కుర్వంతు వాం మంగళమ్
సుముహూర్త స్సావధాన. శుభలగ్న స్సావధాన.
ఇల్లూవాకిలి యింటివాడిదై తే ఇల్లాలు మందేకదా
వచ్చేటందుకు దాని యిష్టమెకదా కుర్వంతు వాం మంగళమ్
సుముహూర్తస్సావధాన. శుభలగ్న స్సావధాన.

ఇటువంటి పేరడీ మంగళాష్టకాలను స్టేజి నాటకాలలో కూడా మునుపు చదివేవారు. విశాఖపట్నం జగన్మిత్ర నాటక సమాజంలోని విదూషకుడు కోనేటిరావుగారు చదివే మంగళాష్టకాలను మా నాన్నగారు నా చిన్నప్పుడు ఉదాహరించడం నాకు బాగా జ్ఞాపకం.

మంగళాష్టకాలు ఒక ప్రక్క ఆనాటి నుండి ఈనాటి దాకా ఇలా వ్యాపించితే శృంగారాష్టకాలు కూడా మన సాహిత్యంలో ప్రవేశించాయి. తంజావూరు నాయకరాజుల యుగంలోనే వివిధ అష్టకాలు ఉండేవని చెప్పవచ్చును. కాకమాని మూర్తి కవి వ్రాసిన రాజవాహన విజయంలో రాఘవాష్టకకం ప్రస క్తి ఉంది. రాజవాహనుడు దండయాత్రకు వెళుతున్నప్పుడు సేనలతోపాటు రాజుగారి భార్య కూడా ఒక అదలంలో బయలుదేరింది. ఆ పల్లకీ వెంట పట్టెనామాలతో శ్రీ వైష్ణవు లిద్దరు రాఘవాష్టకాన్ని చదువుతూ వెళ్ళారని కాకమాని మూర్తి కవి పెద్ద వచనంలో వర్ణించాడు.3 యీ కవి రుద్రకవికి అర్వాచీనుడే.

ఇంకా చాలామంది అర్వాచీనులు శృంగారాష్టకాలు వ్రాశారు. గోగులపాటి కూర్మనాధం వాళ్ళలో ఒకడు. 'చంద్రనగర పురీశ్వరా చెలియ నిను పిలిచిందిరా!' అనే మకుటంతో ఒక అష్టకం వ్రాశాడు. ఇది నష్టమైంది. మదిన సుభద్రయ్యమ్మగారు 'జాలమేల విశాఖపట్టణ జానకీ పరమేశ్వరా!' అనే అష్టకం వ్రాశారు. బళ్ళారి గురురాజయ్య, పల్లి పార్వతీశం అనే కవులు కూడా శృంగార అష్టకాలు వ్రాశారు. ఇవేవీ లభ్యం కావు.

---

1. తంజవూరు ముద్రితగ్రంథాల కేటలాగు. D. 545. M. 508.
2. దక్షిణదేశ యాంధ్ర వాఙ్మయం. నిడుదవోలు వెంకటరావుగారు పుట 96.
3. రాజవాహన విజయం-2 ఆశ్వాసం.

శృంగారాష్టకాలలో రుద్రకవి జనార్దనాష్టకమే ప్రాచీనం అని చెప్పాలి. దీని ఛందస్సు రడగఖేదంకాదు. మత్తకోకిలను మాత్రా ఛందస్సులలోనికి మార్చి రచన సాగించాడు. ఆదిప్రాసేకాక తొలిమూడు పాదాలకు అంత్యనియమం కూడా ఉంది. 'దనుజమర్దన! కందుకూరి జనార్దనా!' ఆన్న సంబోధనే మకుటం. రుద్రకవి వ్రాసిన ఈ అష్టకాన్ని అనుసరిస్తూ అతని సమకాలికులు, అనంతర కవులూ వ్రాసిన అష్టకాలలో కొన్ని లభిస్తున్నాయి. ఇవి ఇప్పటికి అముద్రితాలు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో వీటి ప్రతులు ఉన్నాయి. (R. 128) వాటి వివరాలు ఇవి :

1	R.	128	e	మాధవాష్టకం.
2	R.	128	f	వేంకటేశ్వరాష్టకం.
3	R.	128	g	రఘురామాష్టకం.
4	R.	128	h	రాఘవాష్టకం.
5	R.	128	i	కడపనాయకాష్టకం.
6	R.	128	j	కోనేటిరాయాష్టకం.
7	R.	128	k	జనార్దనాష్టకం.
8	R.	128	l	నవనీతచోరాష్టకం.

వీటిలో అయిదోదీ చివరదీ మాత్రమే మత్తేభ చంప కోత్పల మాలలలో ఉన్నాయి మిగతావి మాత్రా మత్తకోకిల ఛందస్సులోనే ఉన్నాయి. నవనీత చోరాష్టకం పూర్తిగా నీతిబోధకం. (బహుశా ఇది శతక భాగమేమో.) కడపనాయకాష్టకం ఒకటే నాయకుని వచనం. మిగతావి నాయికా వచనాలే. ఎనిమిది అష్టకాలలో జనార్దనాష్టకం ఇప్పటి ప్రథమ ప్రచురణ. మిగతా ఏడింటినీ అనుబంధంలో యథాశక్తి పరిష్కరించి ప్రచురిస్తున్నాను. అష్టకాల అనుబంధంలో ఎనిమిది ఉంటే అందంగా ఉంటుందని ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం పొందిన భ్రమరాంబకాష్టకం కూడా ప్రచురిస్తున్నాను. ఇది భక్తి-అష్టకం.

ఇటువంటి అష్టకాలు ప్రచారం పొందాక అష్టకం అంటే ఎనిమిది ఉండాలనే నియమంపోయి మత్తకోకిల వికార రచనలో వ్రాసిన ఏ ఒక్క పద్యమైనా అష్టకమే అని పిలుస్తూ వచ్చారు. మన యక్షగానాలలో అష్టకం ఆనే పేరిట ఒకే ఒక చరణంవ్రాసిన కవులున్నారు. వాళ్ళలో కంకంటి పాపరాజుగారు ప్రముఖులు. ఆయన విష్ణుమాయా విలాసం అనే యక్షగానంలో 'సురత క్రీడకు ఉన్ముఖురాలైన మోహినిని' శివుడు కలుసుకొనే ఘట్టంలో ఈ 'అష్టకం' ఒకటి వ్రాశారు.

కదియవచ్చిన మేనికాకను గ్రమ్మి పూబొద వాడగా
గొదమతుమ్మొద లూర్పు సెగలని కూడకూడని పాడగా
బదరుమదనుని తూపు లాయముపట్ల పలుమరు గాడగా
ముదిత ముందరి కరిగె శంభుడు మొనసి ముచ్చట లాడగా.

[విష్ణు-పుట 63.

కంకంటి పాపరాజుగారి కాలం క్రీ.శ. 1650 కి పూర్వం. వీరు రుద్రకవికి అర్వాచీనులే. జనార్దనాష్టకంలోని బాణీనే అనుసరించారు.పాపరాజుగారిలాగే ఇతర యక్షగాన కవులు కూడా ఒకే ఒక్క అష్టకం వాడారు. ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర వ్రాసిన మిత్రులు యస్వీ జోగారావుచారు ఎన్నో యక్షగానాలు పరిశీలించి అష్టకం లక్షణం ఇలా నిర్వచనం చేశారు.

"అష్టకము: ఇది కొలది యక్షగానములందు దబుచు నాయిక విరహవేదనాదిక సందర్భములందు బ్రయుక్తము. నాలుగు పాదములు నాల్గు రెళ్ళనిమిది దళములు గలవి. ఆ దళములను బట్టియే యాపేరు. ప్రతిపాదము నచ్చముగా నొక త్రిపుటరేకు, అనగా ఏడేసిమాత్రల దళములు మూడింటిపై నొక యైదుమాత్రలు గలది. సరిగా మత్తకోకిల మాత్ర సంఖ్యలో సరిపోవునది. దానివలనే వృషభగతి గలవి. నాలుగు పాదములకును ఆద్యప్రాసయు, నంత్యప్రాసమును జూపట్టును. ప్రతి పాదమున పదునాల్గు మాత్రలపై అనగా ద్వితీయ దళము ప్రథమాక్షరము యతి స్థానము"1

యక్షగాన రచయితలు ఇలాగ మత్తకోకిల వరుసలో అష్టకాలు వ్రాస్తున్నా, ప్రబంధకర్తలు ఇతర ఛందస్సులలో అష్టకాలు వ్రాయడం కూడా అక్కడక్కడ కనబడుతుంది. ఋగ్వేదకవి వెంకటాచలం శార్దూలాలలో ప్రసన్న వెంకటేశ్వరాష్టకం వ్రాశాడు. 'కార్వేటీశ ! ప్రసన్న వెంకటరమా కాంతా మనోవల్లభా !' అని దీని మకుటం.2

ప్రఖ్యాత కవిగానే కాక లాక్షణికునిగా కీర్తి కెక్కిన కూచిమంచి తిమ్మకవి తన 'రసికజన మనోభిరామం'లో ఒక కందాష్టకం వ్రాశాడు. ఒకదేవాలయంలో ప్రవేశించిన రాజకుమారుడు దేవుణ్ణి చూశాడని చెప్పి అతనిచేత కందాష్టకంలో స్తోత్రం చేయిస్తూ ఇలా మొదటనే చెప్పాడు.

---

1. ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర. ప్రథమభాగం అనుబంధం పుటలు. 312, 313.
2. చూ॥ చంపూ రామాయణం పీఠిక. పుట-6

నికటాగ్ర సంస్థితుడై
ముకుళితకర కమలుడగుచు మొగి నతడు మదిం
బ్రకటమగు భక్తి గందా
ష్టకమున నద్దేవు నిట్లు సంస్తుతి చేసెన్.

[రసికజన 2-25

రసికజన మనోభిరామాన్ని తిమ్మకవి క్రీ. శ. 1750 లో వ్రాశాడు. అప్పటికి ఇతర ఛందస్సులలో కూడా అష్టకాలు వ్రాయడం పరిపాటే అని చెప్పాలి. ప్రబంధకవులు ఈ ఛందస్సులలో వ్రాస్తే, మధురకవులు మాత్రా ఛందస్సులలో అష్టకాలు వ్రాసేవారని చెప్పవచ్చును.

సంఖ్యానియమంగల పంచరత్నాలు, నవరత్నాలు శతకాలు మొదలైనవాటిని ఆధునికులు కూడా వ్రాస్తున్నారుగాని ఎవ్వరూ అష్టకాలు ప్రయత్నించకపోవడం గమనించదగ్గ విషయమే. తెలుగు సాహిత్యంలోని రమారమీ అన్ని ప్రక్రియా భేదాలనూ వ్రాసిన విశ్వనాధ సత్యనారాయణగారు కూడా తెలుగు అష్టకం వ్రాసినట్టు కనిపించదు. రుద్రకవి జనార్దనాష్టకం లాంటిది విరివిగా ప్రచారం పొందితే ఈ ప్రక్రియ కూడా మళ్ళా మన సాహిత్యంలో కనబడవచ్చును.

జనార్దనాష్టకాన్ని మొదటిసారిగా వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీ.శ. 1917 కు పూర్వం తమ చాటుపద్య మణిమంజరి ప్రథమభాగంలో అచ్చువేశారు. అయితేవారు 7 పద్యాలను మాత్రమే ప్రకటించారు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని వ్రాతప్రతే వారికి అధారం అయితే దానిలోని క్రమాన్ని మార్చారు. వ్రాత ప్రతిలో ఉన్న 'చెల్లబో....(5) 'కొదవలన్నియు....'(8) అనే రెండిండిని విడిచిపెట్టారు. అందులో లేని 'అలుకలన్నియు' అనే అదనపు అష్టకాన్ని ప్రకటించారు.

ఇటీవల నెల్లూరు జిల్లా పరిషత్ వారు ప్రచురించిన విక్రమసింహపురి మండల సరస్వంలో కందుకూరి రుద్రకవి జనార్దనాష్టకం ఒకటి అచ్చు వేశారు. అందులో 8 పద్యాలు ఉన్నాయి. ప్రభాకరశాస్త్రిగారు ప్రచురించిన ఏడూ కాక 'జంటనేత్రము లంటి చూచితె" అనే చక్కని అష్టకం ఒకటి అదనంగా ప్రచురించారు.1

ఇప్పుడీ అదనపు అష్టకాలను కలుపుకొంటే జనార్దనాష్టకంలో మొత్తం 10 పద్యాలు ఉన్నట్టు తేలింది. ఈ పదీ రుద్రకవి రచనలే అని చెప్పవచ్చును.
(మా గురువుగారు కూడా ఇలాగే అభిప్రాయపడ్డారట!) అష్టకంలో ఎనిమిది

---

1. విక్రమసింహపురి మండల సర్వస్వం. ద్వితీయ ఖండం పుట 607.

పద్యాలే ఉండడం సబవయినా దొరికినవి వదలడానికి మనస్కరించలేదు. పై పెచ్చు ఇంకొకటి అదనంగా దొరకలేదే అని చింతిస్తున్నాను. రుద్రుల సంఖ్య ఏకాదశం కనుక రుద్రకవి అష్టకంలో 11 పద్యాలు ప్రచురించగలిగితే ఔచిత్యం ఉండేది. అలా జరుగలేదనే బాధ. ఈ పీఠికలో ఎన్నో తక్కువ అయినాయి. అష్టకంలో ఒకటి తక్కువ అయితేనేం అని సరిపెట్టుకున్నాను. పాఠకులూ అలా భావిస్తే సంతోషిస్తాను.

ఆ రుద్రకవి రచనలకు ఆరుద్ర పీఠిక వ్రాయడం ఒక్కటే ముచ్చట అనుకొంటున్నాను. ఈ మురిపెం తీరడానికి మిత్రులు శ్రీ రావు వెంకట ఆనందకృష్ణ రంగారావుగారు [చిక్కవరం జమీందారుల కుమారులు] కారకులు. వారికి ధన్యవాదాలు.

త్యాగరాయనగరు
26-8-66

ఆరుద్ర

జనార్దనాష్టకం

Blank Page

క్రమం

ఇందులో వరుస	తొలి మాటలు	వ్రాత ప్రతిలో వరుస	వేటూరి వరుస	వెల్లూరి సరస్వంలో వరుస
1.	సిరులు మించిన	T. 1	V. 1	N. 1
2.	ఆన పెట్టిన	T. 2	V. 2	N. 2
3.	బిత్తరంబుగ	T. 3	V. 5	N. 5
4.	నిన్న రాతిరి	T. 4	V. 3	N. 3
5.	చెల్లెబో	T. 5	—	—
6.	దబ్బులన్నియు	T. 6	V. 4	N. 4
7.	అండబాయక	T. 7	V. 6	N. 7
8.	కొదవలన్నియు	T. 8	—	—
9.	ఆలుక లన్నియు	—	V. 7	N. 8
10.	జంట నేత్రము	—	—	N. 6

Blank Page

అదయుండై మదనుండు పుష్పశరముల్ హుంకారతన్ పొంచినా
(ఎదలో నాకెను).....
అదనా నన్నెడబాయ? నీకు తగునా హా! హా! జగన్మోహినీ
మదిరాక్షీ విను వెంకటేశ్వరుడనే మన్నించి నన్ గూడవే॥ 5

ఎలనాగా! నిను బాసియున్న దినమున్ యేడేగదే బాలకీ
నెలమొదన్ పది ప్రొద్దులాయె నిపుడున్ నే నెట్లు వేగింతునే
కలనైనన్ నిను బాయకుందు గదవే కాకల్ వృథా శాయకే
చెలియా! నే కడపాధి నాయకుడనే శ్రీ వేంకటాధీశునే॥ 6

విను! నీ చక్కెర తేనె మోవి తనియన్ వేవేగ నాకియ్యవే!
నను నీ కౌగిట జేర్చి ముద్దులిడవే నా కోర్కె లీడేర్చవే!
నను చేపట్టిన పేరు గీర్తి గలదే! నాపై కటాక్షించవే
(చినదానా) కడపాధి నాయకుడనే! శ్రీ వెంకటాధీశునే॥ 7

వడదేరన్ విడెమిచ్చి మచ్చి కలరన్ వామాక్షి నీయెడ్డలో
కడువేడ్కన్ మరుకేళి గూడితివిగా సౌఖ్యంబు నా కబ్బెనే
పుడమిన్ యిద్దర మొక్కటై జగములన్ పోషింపుచున్ యెప్పుడున్
కడ పందున్ వసియించి యుందుము సదా కాంతా శిరోరత్నమా॥ 8

కడపాధినాయకాష్టకము

కలకంఠీ కలహంస చారుగమనా కాంచీ కలాపోజ్జ్వలా
అలివేణీ కుసుమాంగి! చంద్రవదనా! హార్యక్షమధ్యా! శుభాం
(న్గ).....దయతో నాపై కటాక్షించవే!
(చెలి)యా! నే కడపాధి నాయకుడనే! శ్రీ వెంకటాధీశునే॥ 1

కులుకుం గుబ్బలు (రొమ్ములపైన) గదియన్ కోపించి నాటించవే!
పలు (కుంతేనియ లుప్పతిల్ల) పలుకే! వాదమ్ము లింకేటికే
అలనాడాడిన మాట (నో)ల్లగదవే ఆ మాట నే దప్పనే
చెలియా! నే కడపాధి నాయకుడనే శ్రీ వేంకటాధీశునే॥ 2

రావే చిలకల కొల్కి! రూపవతి! యోరామా! మనోహారిణీ!
కోవే కొ(మ్మెడె డెంద) మందుకొనవే! కోకిల్ ఘనంబాయెనే
నీ వాడన్ నిను నమ్మియుందుగదవే నిక్కంబు నే వేటకతో
సేవల్ సేసెద కాగిలియ్యగదవే! శ్రీ వేంకటాధీశునే॥ 3

ఓ లావణ్యవతీ! సరోజ వదనా! ఓ పక్వబింబాధరీ!
చాలన్ వెన్నెల మించికాయ నిపుడున్ సంతాపముల్ మించనే
బాలా మొక్కెద కాగిలియ్య గదవే ప్రాణంబులున్ నిల్పవే
శ్రీ లక్ష్మీపతినే ధరాధిపుడనే శ్రీ వేంకటాధీశునే॥ 4

కొమ్మరా (నిను నమ్మెరా) ముద్దుగుమ్మ అన్నియు నెరుగురా
ఎమ్మె మీరగ యేచనేటికి యింతివూవుల బంతిరా
కమ్మవిలుతుడు పూవు వింటను యిమ్మరింపుచు నుంటనూ
క్రమ్మకొని వేయంగ నోర్వదు కాంత నేలుకో రాఘువా.


అంతరంగములోన నుండియు చింత చేయుచు నుండియున్
ఇంత యేచుట నీకు వద్దురి పంతమా బలవంతమా
కొంతదూరుచు నిన్నె కోరెడి కాంతనిప్పుడు యెంచరా
సంతతంబును వింత లేటికి జానకీపతి రాఘువా.

పొంచి మదనుడు శరము లేయుచు అంచ గమనపై నించగా
మించె విరహము మీనలోచన యెంచగా దయ యుంచరా
సంచితంబున దైవరాయ మేలెంచియున్ లాలించియున్
చంచలాక్షిని యేలు వేడుక జానకీపతి రాఘువా.


వసుమతీసుత వాసవార్చిత వారిజానన మిక్కిలీ
కుసుమకోమలి కిసలయాధరి బిసప్రసూనపు నేత్రిరా
పసిమి కలిగిన భామరత్నము నేలుకో రహి మించగా
(రసిక శే)ఖర మునుకులొత్తుదు రామచంద్ర దయానిధీ.

అనుబంధం


Blank Page




Blank Page



Blank Page



Blank Page




Blank Page



Blank Page



Blank Page




Blank Page





Blank Page



Blank Page

నవనీత చోరాష్టకము

సళ్ళుచు ప్రాణభీతియై సారె భయంపడు దేహదారి గుం
డ్రాళ్ళను రువ్వినన్ శత శిరంబులు నాటిన రోగ ముట్టినన్
(నీళ్ళ) మునింగినన్ రిపులు నిర్దయులై గర(ళ)ంబు బెట్టినన్
(డ్రై)ళ్ళునె బ్రహ్మవాత కడతేరక యో నవనీత చోరకా

ఘనమగు మంత్రి తేని నృపుకార్యము, నేరని వాని విద్య, లు
బ్ధుని సిరి, వృద్ధ నారీరతి, భూసురుపా, టవివేకి నీతి, మ
త్తుని చదు, వల్పుతో చెలిమి తూగొని మేలని లోక మెంతురే
కినియుచు నెంత హా! యనుచు కేరక యో నవనీతచోరకా

లక్ష వ్రతంబులుండి పది లక్షల తీర్థములాడి భస్మ రు
ద్రాక్ష జటాధటా భరణు.....మునులై జరింప నా
యక్షయ కింకర బాధలణం...ధరింప వచ్చునే (!)
కుక్షిలో మీ పదామృతము గూరక యో నవనీత చోరకా

ఆసలు పుత్ర మిత్ర జన కాదుల బాసి మహోపవాసులై
దాసుల టంచుజేరి సతతంబును వంచన లేక మానవుల్
గాసముబెట్టు మంచు బరిగంటును గొల్చిన మేలుగల్గునే
దూసలు బారి యెత్తు బడి దూరక యో నవనీత చోరకా

పసరము గైవడిన్ విటుడు పైబడి తుచ్ఛపు బంధరీతులన్
కుసమము వేచినట్లు కుశిగుంపులు జేసిన మేలు గల్గునే
నిశిత మనోజ బాణనిభ నిర్మల కాంతి నఖాగ్రపంక్తులన్
కిసలయ పాణి చన్మొనలు గీరక యో నవనీత చోరకా

పసగల యాచకుండు జినభావ మెరింగి (చరించ)గావలెన్
రసికుని విద్యకాదనక రమ్మని ప్రార్థనజేసి మెచ్చినన్
గొసరక యాని వాని మరి గొబ్బున దిట్టక చారు కీర్తితో
పొసగని లోభితో జిగురు పోరక యో నవనీత చోరకా

గదరున రాకుమారకుడు కండలు బెంచుక వూరకుండితే
విదిత బలంబు శౌర్యమును విస్మిత కీర్తులు గల్గనేర్చునే
బెదురొక యింత లేక అతి భీకర బంధుర యుద్ధభూమిలో
యెదిరిన వైరి కొట్టి తల నేరక యో నవనీత చోరకా

కసరెడి కాపు, ధూర్తయగు కామిని, దుష్టగు బంటు, వట్టిరా
జసమున నుబ్బు సుంకరి, నిజంబొక యింతయు లేని దాసి, న
ప్పసమున రమ్మ పొమ్మనియు ప్రార్థన జేసిన లెక్కసేతురే
మసలక చేతి కొద్ది బడిమారక యో నవనీత చోరకా

భూత నాథుని వామ భాగము పొందుగా నైకొంటివే
ఖ్యాతిగా శ్రీ శైల మందున ప్రఖ్యాతిగా నివశిస్తివే
పాతకంబులు పారదోలుచు భక్తులను చేకొంటివే
శీత గిరిపైనుండి వెలసిన శ్రీ గిరీ భ్రమరాంబికా॥

సోమశేఖర పల్లవాధరి సుందరీమణి ధీమణీ
కోమలాంగి కృపాపయోనిధి కుటిలకుంతల యోగినీ
నా మనంబును బాయకుండుమ నళినలోచన ధీమణీ
సీమలోపల వినుతికెక్కిన శ్రీ గిరీ భ్రమరాంబికా॥

వారిజాయత నేత్రి కోకిల్వాణి సత్యవిచారిణీ
భూరిగుణముల లోకపావని పువ్వుబోణి శిఖామణీ
సీరికిని, కంసారికెలమిని జయమొసంగిన ధీమణీ
సిరులు యిత్తువు నీవు ఎప్పుడు శ్రీ గిరీ భ్రమరాంబికా॥

తరుణ శ్రీ గిరి మల్లిఖార్జున దైవరాయ శిఖామణీ
కరుణతో మమ్మేలుకొంటివ కల్పవృక్షమ ధీమణీ
వరుస ఎనిమిది అష్టకమ్ములు వ్రాసి చదివినవారికీ
సిరులు యిత్తువు నీవు ఎప్పుడు శ్రీ గిరీ భ్రమరాంబికా॥

భ్రమరాంబికాష్టకం

రవిసుధాకర వహ్నిలోచన రత్నకుండల భూషిణీ
ప్రవిమలంబుగ మమ్ము నేలుమి భక్తజన చింతామణీ
అవని జనులకు కొంగు బంగారైన దైవ శిఖామణీ
శివుని పట్టపురాణి గుణమణి శ్రీ గిరీ భ్రమరాంబికా॥

అఖయంబుగ కాశిలోపల అన్నపూర్ణ భవానివై
సాక్షి గణపతి కన్నతల్లివి సద్గుణావతి శాంభవీ
మోక్ష మొసగెడు కనకదుర్గవు మూల కారణ శక్తివీ
శిక్ష చేతువు దుష్ట జనులను శ్రీ గిరీ భ్రమరాంబికా॥

అంగ వంగ కళింగ భూముల నాంధ్ర దేశములందునా
పొంగుచూ బంగాళ కొంకణ పుణ్యభూముల యందునా
రంగుగా కర్ణాట రాట మరాట దేశములందునా
శృంగళా దేశమున వెలసిన శ్రీ గిరీ భ్రమరాంబికా॥

కలియుగంబున కాశిలోపల కల్పతరువై యుంటివీ
వెలయ శ్రీ గిరి శిఖరమందున విభవముగ నివశిస్తివీ
అవనిలోపల భక్త జనులకు అవని దానము లిస్తివీ
జిలుగు కుంకుమ కాంతి రేఖల శ్రీ గిరీ భ్రమరాంబికా॥

ఒంటిమిట్ట రఘునాయక కాష్టకం

మానవతి వినవమ్మ చంద్రుడు మంచి వెన్నెల గాసెనే
సూన శరములు వింట మదనుడు సూటి దప్పక యేసెనే
భానుతేజుడు తెలిసి యంతట పంతమున ననుడాసెనే
మేన గంధము పూసెనే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

మాడలూ పలు మడుపు చీరలు మాటి మాటికి యిచ్చునే
పాడి దప్పక నన్ను పూవుల పాన్పు మీదికి దెచ్చునే
జోడు బాయక యుండినప్పుడె సురత కేళికి మెచ్చునే
మేడ మీదికి వచ్చునే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

పుట్టినప్పుడె హరుని చాపము పూని నడిమికి ద్రుంచెనే
గట్టిగా జానకిని పెండ్లియు ఘనత మీరగ నాడెనే
చుట్టురాయై యు న్నహల్యను చూచెనే కరుణించెనే
మెట్టి శాపము తీర్చెనే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

కులుకు గుబ్బలమీద చక్కని క్రొన్నెలవంకలు దీర్చునే
మొలక కెంపుల నొప్పు తీయని మోవిపై మొలిపించునే
అలరు కోయిల చిలుక పలుకులు అంతకంతకు మించెనే
మెలతరో వలపించెనే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

అక్కరో నా గుణవిశేషము అతను కేళికి బిల్చునే
చక్కదనమున యెవ్వరూ తన సాటిలేరని యెంచునే
ఒక్క నిమిషము రాక యుండిన పెక్కు యుగములు దోచునే
మిక్కిలీ నెరజాణడే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

తార హార పటీర శారద ధవళ కీర్తి విహారుడే
చారు మోహనరూపుడే కౌసల్య కూర్మి కుమారుడే
ఘోర రావణ కుంభకర్ణుల కొట్టివేసిన శూరుడే
మేరునగసమధీరుడే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

•

పెచ్చి రాజ్యము లేలునే బుధులెంత జెప్పిన జేసునే
వచ్చి వాకిట నిలుచునే తన వార్తలన్నియు తెలుపునే
(పచ్చ విలుతుని కేళిలోపల భామరో నను మెచ్చునే
మెచ్చి నా తమి దీర్చునే) ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

మంచి గుణముల జనులనే తను మహిమతో రక్షించునే
పంచబాణుని బాహుబలమున పారగా (తను) దోలునే
(.....)
మించు కృప నన్నేలనే ఒంటిమిట్ట శ్రీరఘురాముడూ

కిలుపట్ల కోనేటి రాయాష్టకం

శ్రీలు మించిన మేడ మీద వసించి ఉయ్యలశయ్యనూ
బాల నిన్నటనుండి యుండె నీ పాదమాన నిజంబురా
ఏలరా చెలి గోలరా దయ నేలరా కడు వేడ్కతో
ఈ లతాంగిని కిలుపట్ల కోనేటిరాయ దయానిధీ

లలిత రూపవిలాస విభ్రమ కలికి చిలుకల కొలికినీ
వలల జిక్కిన దింత చక్కని వారిజాక్షిని యెంచరా
చలము లేటికి నీదు క్రొగిట సంభ్రమంబున చేర్చియే
ఎలమి యింతిని కిలుపట్ల కోనేటిరాయ దయానిధీ

నిండు చందురు వంటి మోమును నిగ్గుతేరెడి చెక్కులున్
కండ చక్కెరవంటి మోవియు కలికి ముద్దుల గుమ్మరా
అండ నున్నది చేరబిలుచుకు ఆదరమ్మున యేలుకో
ఎండ కోర్వదు కిలుపట్ల కోనేటిరాయ దయానిధీ

అంచయాన లతాంగి నిన్ను నహర్నిశంబులు నాత్మలో
నుంచె చాల తలంచరా దయనుంచరా వలపెంచరా
పెంచెరా మదనుండు వెన్నెల మించెరా కడువేడ్కతో
నించి యేలర కిలుపట్ల కోనేటి రాయ దయానిధీ

జారు కొప్పును దువ్వి కస్తురి – నీర బొట్టును దిద్దియున్
ఓర పయ్యెద చక్క నొత్తి వయ్యారి గుబ్బల నొత్తియున్
గోర చెక్కిలి గీరి ముద్దిడి కోమలాంగిని గూడరా
వేరు శాయక కిలుపట్ల కోనేటి రాయ దయానిధీ

[మిగత మూడూ దొరకలేదు]

వేంకటేశ్వ రాష్టకం

శ్రీరమా రమణీ మనోహర! శీత భాను కళాననా!
వారి జాసన వంద్య! దానవ వంశ సంహర కారణా!
వారిజాక్షిని చూడరా శుక వాణిరా పువుబోణిరా
వీర సామజ సింహ తిరుపతి వేంకటాచల వల్లభా

కంట గింపుల పుట్టింటి లోపల ఒంటినుంట నీ వెరుంగవా
బంటు పంతము మాని మా చెలి ప్రాణములు రక్షించవా
గొంటు తనములు శాయనేటికి కొమ్మరా నిను నమ్మరా
వెంటనే దయ చూడు తిరుపతి వేంకటాచల వల్లభా

కప్పురము కస్తూరి గంధము కానుకలు నీ కంపెరా
ఒప్పుతో కైకోర యిటువలె (ఓర) చూపులు మానరా
చెప్పరాదుర చెలియ విరహము చిత్తగించర దాని నీ
విప్ప శాయగ వలదు తిరుపతి వేంకటాచల వల్లభా

కన్నతల్లి, మరుంగు - దానిని కాకు శాయగ న్యాయమా
కన్నె ప్రాయము వన్నెలాడి, వికాస నీరజ నేత్రిరా
నిన్నె కాని మ రన్నెమెరుగదు; నీరజాక్షిని కూడరా
విన్నపం బిదుగోర తిరుపతి వేంకటాచల వల్లభా

ఎలమి చంద్రుడు కాయగా (ఎలదేటి గుంపులు) ప్రేమాయగా
చెలగి కోయిల సద్దుశాయగ చిలుక పలుకులు డాయగా
మలయు చల్లని గాలి వీవగ మారు తాపము మాన్పరా
వెలది నమరగ నేడు తిరుపతి వేంకటాచల వల్లభా

గోర చెక్కిలి మీటుతూ చను గుబ్బలొయ్యన నొత్తరా
చేరి కెమ్మో వాని మా చెలి చిత్తతాపము మాన్పరా
మేర మీరిన యుపరిసురతము మీన నేత్రికి నీయరా
వేరు శాయగ వలదు తిరుపతి వేంకటాచల వల్లభా

పలుకులా నీ చక్కదనమును పాడి బల్నుతి చేసెరా
కులుకు గుబ్బల చెమట జారగ కూర్మితో నిను పిలుచురా
చెలులు దగ్గర ఉండి చూచిన సిగ్గుతోడుత నవ్వెరా
వెలది ఓర్వగ లేదు తిరుపతి వేంకటాచల వల్లభా

పొందు లక్ష్యము శాయవేటికి పొన్న పూవుల పాన్పుపై
అంద మలరగ జాజిశయ్యను అతివ నేలుకో వేడ్కతో
ముందు నీవని నమ్మియుంటిని మోసపోతిని దానికిన్
విందు పై దయసేయు తిరుపతి వేంకటాచల వల్లభా

మాధవాష్టకం

మామకున్ నీవు కోడలైతివి మామలోనే యుంటివి
మామకూతురు మగని తమ్ముని మాడుపై పవళిస్తివి
మామలో జనియించి పెంచిన మంచికోడలి దెస్తివి
మామ తమ్ముడవైన గోరంట్ల మాధవేశ దయానిధీ.

మనుమనికి యొక మనుమడై యొక మనుమనికి మరదైతివి
మనుమనిచ్చిన తనయునికి నీ మరదలిని దెచ్చిస్తివి
మనుమనికి యుదయిస్తివి నీ మహిమ లెవరికి దెలుసును
మనుమనికి పినతండ్రి గోరంట్ల మాధవేశ దయానిధీ

మరదికిని పిన్నయ్యవై నీ మరదికే మామైతివీ
మరది నీవును మునుపు - దిక్కు- మహీపతికి నుదయిస్తివి
హరికుమారుని చేరనిస్తివి అక్కునను చేర్చుకొంటివి
మరుని గన్నా తండ్రివి గోరంట్ల మాధవేశ దయానిధీ.

మంచి అలికుల వేణి తనయుని మనుత మున్నీరింటిలో
యెంచి గాచినవాని పట్టణమేలించితివి మరి లెస్సగా
వంచి బాణుని మరది తండ్రిని వుంచితివి నీ అడుగులో
మంచి గుణముల స్వామి గోరంట్ల మాధవేశ దయానిధీ.

పాము వైరము వాని తనయుని పట్టి నిన్నే సాటికి
నే మమునమూ పెండ్లి చేస్తివి నీ నేర్పు లెవ్వారి కున్నవి
పాము వైరము వాని తనయుని బావవైతివి బాగుగా
మా కూతురు మామ గోరంట్ల మాధవేశ దయానిధీ.

గోపతి పతి మామ వైతివి గోపతికి సిరులిస్తివి
గోపతి మని బిడ్డనిస్తివి గోచరుల పతివైతివి
గోపతికి నివు తండ్రివైతివి గోకులం బిల యేలితి
మా పతివి నీవైన గోరంట్ల మాధవేశ దయానిధీ.

•

రాజశబ్దము సతిజేకొంటివి రాజ వన చేకొంటివి
రాజపుత్రి పెద్దమగని చేత నె రాజ్యమెల్లను యేలిస్తివి
రాజ చెరియను గూడితివి వొక రాజసంబున వేడ్కతో
రాజ విభుడవు అయిన గోరంట్ల మాధవేశ దయానిధీ.

మాధవాష్టక మెవరు చదివిన మనుజు లెవ్వరు ప్రవాసినా
ఆదరంబున విన్న వారికి అష్టభోగము లిత్తువూ
బోధ గలిగిన మంచి పుత్రుల పుణ్యమధికం బిత్తువూ
రాధికా విభుడైన గోరంట్ల మాధవేశ దయానిధీ.

సవరణలు : వివరణలు

తప్పొప్పుల పట్టిక లేకపోతే తెలుగుపుస్తకం కాదు ; తప్పులు చేయనివాడు మనిషే కాడు. మేము గుర్తించిన తప్పులు మన్నించి దిద్దుకోమని ప్రార్థన.

పుట 6	బంతి 11	కామేశ్వరుడికి అనే మాట బదులు సోమేశ్వరుడికి అని ఉండాలి.
పుట 7	బంతి 18	పండరంగడు అనే పదంలో 'ప' అనే అక్షరం జారిపోయింది.
పుట 24	బంతి 25	గోగులపాటి కూర్మనాథుడు ప్రాసిన అష్టకం నష్టమైందని చెప్పడం జరిగింది గానీ అదృష్టవశాత్తు అది దొరుకు తూంది. బాగుంటుంది కాబట్టి పూర్తిగా ఇక్కడే ఉదాహరిస్తున్నాం!

శ్రీరమాంగన నిన్ను బాసీ - చింత వేగుచునుండెరా
మారుడాపై బూల శరముల మర్మమంటగ (నేసెరా)
సారె సారెకు నిన్ను బాసిన - క్షణము తాళగ లేదురా!
రార! చంద్రనగగ పురీశ్వర! రమణి నిను పిలిచిందిరా.

దీనిని ఏకాంతసేవ అనేపేరుతో 'కూర్మనాథకవి కృతులు' అనే సంకల నంతో ఆంధ్ర విజ్ఞాన సమితి (విజయనగరం) వారు ప్రకటించారు.

~~60~~ 70

ఏలరా! చలమేలరా! చెలినేలరా! యది గోలరా!
బాల నీకై మరులు చెందిన చానరా! దయ బూనరా!
నీలనీరద దేహ! ఈ గతి నీకెవ తె బోధించెరా?
మేలు చంద్రనగర పురీశ్వర! మెలత నిను పిలిచిందిరా!

ఇందిరావర! బంతిరా! మదమెక్కకాముని దంతిరా!
పంత మీగతి జేతురా! చెలి పైని నెనరిటు దాతురా!
వింత జేయగ రాదురా! మరుబారి కోర్వగ లేదురా!
కాంత! చంద్రనగర పురీశ్వర! కాంత నిను పిలిచిందిరా!

అలుక నెన్నడు జేసెనా? కలనైన నిన్నెడ బాసెనా?
చులక చూడగ జెల్లునా? సుదతి మది రంజిల్లునా?
చల మిదేటికి రార? సా మిక జామేటికి పంతముల్
వలదు చంద్రనగర పురీశ్వర! వనిత నిను పిలిచిందిరా!

కొమ్మ నీకై మల్లెమొగ్గలు కోసి దండలు కట్టెరా!
కమ్మ కస్తూరిచేత నుదుటను కల్క తిలకము దిద్దెరా!
నెమ్మదిన్ దయ బుట్టవలెనని నీకు దండముబెట్టెరా!
రమ్మ చంద్రనగర పురీశ్వర! రామ నిను పిలిచిందిరా.

నేర మేమని మాటిమాటికి నీరుకన్నుల నించురా!
మేరమీరిన విరహవేదన మించురా! భ్రమయించురా!
మేరగాదుర నీకు నీగతి నెలతపై దయయుంచురా!
మేలు చంద్రనగర పురీశ్వర! మెలత నిను పిలిచిందిరా.

గడియ యుగముగ జూచురా! తన కర్మమని తలయూచురా!
చెడుగు వీడని చంద్రు దిట్టుచు, నేతులల్లన జాచెరా
తడవుచేసిన తాళజాలదు, తగవుతప్పక నీవు రా
వడిగ చంద్రనగర పురీశ్వర! వనిత నిను పిలిచిందిరా.

మారువేదన తాళజాలదు! మానినీమణి సోలెరా
భూరితాపము వెగ్గలంబుగ పూలపాన్పున వాలెరా
కోరి నిన్నున్ వేడినదిరా! కూర్మదాస వరప్రదా!
ఔర! చంద్రనగర పురీశ్వర! యతివ నిను పిలిచిందిరా.

ఇప్పటికి తెలియవచ్చినంత మట్టుకు, అష్టకాలు చెప్పినవాళ్ళూ, అష్టకాల గురించి చెప్పిన వాళ్లూ పదిహేనుమంది మన సాహిత్యంలో కనబడుతున్నారు. అకారాదిగా వాళ్ళ వివరాలు ఇవి :

1. కూర్మనాధం, గోగులపాటి — అనేక మధుర కవితలు చెప్పాడు. చంద్ర నగర పురీశ్వరాష్టకం వ్రాశాడు.

2. గురురాజయ్య, బళ్ళారి — ఇతడు రాఘవేంద్రాష్టకం చెప్పాడు. [చూ॥ వంగూరి వారి శతక కవుల చరిత్ర పుట 666]

3. తిమ్మకవి, కూచిమంచి • — రసికజన మనోభిరామంలో కందాష్టకం వ్రాశాడు.

4. తిమ్మరాజు, సిద్ధిరాజు — పరమయోగి విలాసంలో అష్టకాలను పేర్కొన్నట్లు జ్ఞాపకం.

5. పరమానంద తీర్థులు — ముక్తికాంతా పరిణయంలో అష్టకాలు వ్రాశాడు.

6. పాపరాజు, కంకంటి — విష్ణు మాయా విలాసంలో ఒకే ఒక అష్టకం రచించాడు.

7. పార్వతీశం, పల్లి — ఇతడు శతక కవే. గో అష్టకం వ్రాసినట్టుకూడా తెలుస్తోంది. ఇతని సంగతి ఎక్కడ చదివేనో మరచిపోయాను.

8. మూర్తికవి, కాకుమాని — రాజ వాహన విజయంలో రాఘవాష్టకాన్ని పేర్కొన్నాడు.

9. రంగాజమ్మ — మన్నారుదాస విలాస ప్రబంధంలో మంగళాష్ట కాలను పేర్కొంది.

10. రుద్రకవి, కందుకూరి — జనార్దనాష్టకం చెప్పాడు.

11. వాసుదేవ దీక్షితులు — పార్వతీ పరిణయం అనే యక్షగానంలో బూతుల అష్టకాలు (పేరడీలు) చెప్పించాడు.

12. వీర శరభయ్య, బాణాల — ఇతడు గోరంట్ల మాధవశతకం రచించాడు. ఈ పేరుతో ఒక అష్టకం కూడా ఉంది. (ఈ పుస్తకంలో ప్రచురించాం) దీన్ని ఇతడే వ్రాశాడేమో!

13. వెంకటరమణ, పొత్తపి — లాక్షణికుడు. ఈయన తన లక్షణ శిరోమణిలో అష్టకాల లక్షణం చెప్పాడు.

14. వెంకటాచలం, ఋగ్వేదకవి — కార్వేటి నగరంలోని వెంకటేశ్వరస్వామి మీద అష్టకం చెప్పాడు. ఇవి శార్దూల వృత్తాలు. చంపూరామాయణంలో ఇవి ఉదాహరించారు.

15. సుభద్రయ్యమ్మ, మదిన — ఈమె విశాఖపట్టణంలోని దైవం మీద జానకీ పరమేశ్వరాష్టకం వ్రాసినట్టుంది.

భావి పరిశోధనవల్ల అష్టకాల గురించి ఎక్కువగా దొరకవచ్చునేమో గాని ప్రస్తు తానికి మాత్రం ఇంతే సంగతులు చిత్తగించవలెను.




చుండిలో ఆలయ ప్రతిష్ఠ చేసిన మల్లారెడ్డి విగ్రహం ఇది.
పక్కనున్నది అతని ధర్మపత్ని.

ಕಳಸಿಯ ಮಾರಿಯಮ್ಮ ದೇವಿಯ ಮೂರ್ತಿ



సూచీ స్తంభం
రెండోపక్క నున్న
బొమ్మలు.
ఈ ఆరాధకులు
రుద్రకవి
వంశంలోని వారా?

కందుకూరు
జనార్దనస్వామి వారి
ఆలయ ప్రాంగణంలోని
ఒక సూచీ స్తంభం
పైనున్న బొమ్మలు ఇవి.
ఇందులో వీణా పాణి
కందుకూరి రుద్రకవి
కాదు కదా?



ಕಂಬಸ್ತಂಭದ ಮೇಲೆ ಕುಳಿತಿರುವ ಸಿಂಹಗಳು

Blank Page

Blank Page

